నేటి కందం- నేటికి అందం

రేబవలును దేశమునకు
ప్రాబల్యము నొసగు రైళ్ళ రక్షణ కొరకై
కూబరముగ చెలువొందెడి
“రోబో పోలీసు సేవ” రుచిరం బయ్యేన్ !!

(దేశం మొత్తంలో రైల్వే రక్షణ కోసం రోబో పోలీసుల సేవలు అందుబాటులోకి తెస్తూ మొట్టమొదటి సారి దీనిని విశాఖ పట్నం రైల్వే స్టేషన్లో ప్రారంభించారు.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

రాష్ట్రాల్లో గవర్నర్ల
రాజకీయ పాత్ర
ప్రతిపక్ష ప్రభుత్వాల
ప్రగతినడ్డే మాత్ర.
కర్ణాటక అసెంబ్లీలో
కడు దైన్యపు ప్రసంగం
చెప్పకనే రాష్ట్ర విజన్
చెంగుమనే విహంగం

చురక

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ శనివారం 24-1-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:138 పేజీలు:6 వెల: రూ.1/-

# మహాజాతరకు నిరంతర విద్యుత్

### -మూడు 33/11 కేవీ సబ్‌స్టేషన్ల నుంచి సరఫరా
### -ప్రమాదాల నివారణకు 11కేవీ, 33కేవీ లైన్‌లకు కవర్డ్ కండక్టర్స్
### -కార్పొరేట్ కార్యాలయం నుంచి పర్యవేక్షణ
### -విధుల్లో 350 మంది సిబ్బంది

ములుగు, జనవరి 23: మేడారం జాతరలో ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ అందించేందుకు రూ.5కోట్ల నిధులతో ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ఏర్పాట్లు పూర్తిచేసింది. ఈనెల 28నుంచి మేడారం జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో జాతర పరసరాల్లో ఎటు చూసినా విద్యుత్ కాంతులు జిగేల్ అంటున్నాయి. జాతరను సక్సెస్ చేసేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి ఐదు రోజులు నిర్విరామంగా విధులు నిర్వహించేందు కు సిద్ధమవుతున్నాయి. విద్యుత్ అంతరాయాలు ఏర్పడితే సత్వరమే పునరుద్ధరించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు.

**పర్యవేక్షణకు 50 బృందాలు**

జాతర పరిసరాల్లో ఎలాంటి అంతరాయలు లేకుండా ముందస్తుగా నివారించడంతోపాటు అనుకోకుండా అంతరా యం ఏర్పడితే సత్వరమే పునరుద్ధరణ చర్యలు చేపట్టేందు కు 50 బృందాలను సిద్ధం చేశారు. జాతర పరిధిలో 193 ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేయగా, కొత్తగా నార్లాపూర్‌లో రూ.2.50 కోట్లతో 33/11కేవీ సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. వీటి ని రన్ చేసేందుకు ఆపరేషన్, ప్రాజెక్టు డైరెక్టర్ల ఆధ్వర్యంలో ఇద్దరు సీజీఎంలు, ఏడుగురు డీఈలు, 20 మంది ఏడీఈ లు, 150మంది ఇంజనీర్లు, మెంటెనె న్స్ సిబ్బంది కలిపి 350 మంది వరకు విధుల్లో నిమగ్నం కాబోతున్నట్లు ఎన్పీడీసీఎల్ యాజమాన్యం వెల్లడించింది.

నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లకు ఒక బృందం చొప్పున(ఏఈ, ముగ్గురు ఆపరేషన్ సిబ్బంది) పర్యవేక్షిం చనుంది. 33 కేవీ లైన్స్ పర్యవేక్షణకు తాడ్వాయి, పస్రా, గోవిందరావుపేట, చెల్పూర్, ఏటూరునాగారం, కమలాపూర్, ములుగు సబ్‌స్టేషన్‌ల పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని, ఇవే ప్రాంతాల్లోని ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్‌ల వద్ద విద్యుత్ సరఫరా పర్యవేక్షించేందుకు 20 మంది ఇంజనీర్లు, ఆపరేషన్ సిబ్బందిని ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర పనుల కోసం సామగ్రిని తరలించేందు కు 30 వాహనాలను కేటాయించారు.

**కార్పొరేట్ ఆఫీస్ నుంచి పర్యవేక్షణ**

విద్యుత్ వోల్టేజీ, ఫీడర్ లోడ్, అంతరాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్కాడా ద్వారా పర్యవేక్షిం చనున్నారు. దీనికోసం ఇప్పటికే మేడారంలోని రెండు 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లలో రియల్ టైం ఫీడర్ మేనేజింగ్ సిస్టం (ఆర్‌టీఎ-ఫ‌ఎంఎస్)ను ఏర్పాటు చేశారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా, వ్యాపారులు విద్యుత్ వైర్లకు కొక్కిలు వేయకుండా మేడారం, సమ్మక్క, సారక్క సబ్‌స్టేషన్ల పరిధిలో 26 కిలోమీటర్ల మేర 11కేవీ లైన్స్, 15 కిలోమీటర్ల మేర 33కేవీ లైన్స్‌కు ఓపెన్ కండక్టర్ స్థానంలో కవర్డ్ కండక్టర్‌లు ఏర్పాటు చేశారు.

విద్యుత్ ప్రమాదాల నిరోధానికి ఎల్‌టీ లైన్‌ల మధ్య స్పేసర్స్ ఏర్పాటు చేశారు. మేడారం, నార్లాపూర్, కొత్తూర్‌లోని సబ్‌స్టేషన్‌లను పస్రా 132/33 కేవీ సబ్‌స్టేషన్‌కు అనుసంధానం చేశారు. ప్రత్యామ్నాయం కోసం ములుగు 132/33 కేవీ సబ్‌స్టేషన్, కమలాపూర్ ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా పొందేలా ఏర్పాట్లు చేశారు. కాగా, కొత్తగా ఏర్పాటు చేసిన నార్లాపూర్ సబ్‌స్టేషన్ నుంచి పార్కింగ్ కేంద్రాలకు, పరిసర ప్రాంతాల్లోని దుకాణాలకు, గ్రామాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బుల్లెట్ కలకలం

హైదరాబాద్, జనవరి 23:శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో బుల్లెట్ కలకలం రేపింది. తిరుపతి నుంచి శంషాబాద్ వచ్చిన ఓ వ్యక్తి బ్యాగ్‌లో సీఐఎస్ఎఫ్ సెక్యూరిటీ అధికారులు బుల్లెట్‌ను గుర్తించారు. దానిని స్వాధీనం చేసుకున్న అనంతరం.. విచారణ నిమిత్తం ఆ వ్యక్తిని ఎయిర్‌పోర్టు పోలీసులకు అప్పగించారు.

గతేడాది అక్టోబర్‌లోనూ కోల్‌కతా నుంచి హైదరాబాద్ వస్తున్న ఓ ప్రయాణికుడి వద్ద సెక్యూరిటీ అధికారులు బుల్లెట్‌ను గుర్తించారు. ఆ ప్రయాణికుడిని విశాల్‌గా గుర్తించారు. అతడి బ్యాగ్‌లో 38 ఎంఎం బుల్లెట్ లభ్యమైంది. విశాల్‌ను అదుపులోకి తీసుకున్న సెక్యూరిటీ అధికారులు.. అతడిని పోలీసులకు అప్పగించారు.

శంషాబాద్ విమానాశ్రయం నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. వివిధ దేశాలు, రాష్ట్రాలకు వెళ్లే సాధారణ ప్రయాణికులు, వీఐపీలు ఎయిర్‌పోర్టుకు వస్తుంటారు. ఈ క్రమంలో ఎయిర్‌పోర్టులో భద్రత కట్టుదిట్టంగా ఉంటుంది. ప్రతీ ప్రయాణికుడి బ్యాగ్‌లను భద్రతా సిబ్బంది తనిఖీలు చేస్తుంటారు. తనిఖీల సందర్భంగా డ్రగ్స్, బంగారం, ఆయుధాలు బయటపడుతూ ఉంటాయి.

# జనవరి 28 న ఫార్మసిస్ట్ పోస్టులకు జాబ్-మేళా

### - 100 ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీ

హైదరాబాద్, జనవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఉస్మానియా యూనివర్సిటీ లోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో అపోలో ఫార్మసీ ఆధ్వర్యంలో ఈ నెల 28 న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నది ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయి మెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ జాబ్ మేళా నిర్వహిం చనున్నారు.

అపోలో ఫార్మసీ లోని ఫార్మాసిస్టు, అసిస్టెంట్ ఫార్మసిస్ట లకు చెందిన 100 పోస్టులను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు డీ ఫారసీ , బీ ఫార్మసీ ఎం.ఫార్మసీ, మరియు ఏదైనీ డిగ్రీ చేసిన యువతి యువకులకు18 నుండి 35 సంవత్సరాల వయసు వారికి మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ చీఫ్ ఒక ప్రకటనలో తెలియజేసింది .

రూ.12,000 నుండి రూ.25, 000 వేలవరకు వేతనం ఉండే ఈ ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు మరి న్ని వివరాలకు ౦ ఎ ౨ ౨ ౨ ఎ తి , (.8247656356) ను సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు విద్యార్థతల సర్టిఫికెట్ల జిరాక్స్ తో ఉస్మానియా యూని వర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో,వద్ద నేరుగా జనవరి 28,2026 న హాజరు కావాలని ప్రకటనలో పేర్కొన్నారు


# జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. పాక్ ఉగ్రవాది హతం

న్యూఢిల్లీ, జనవరి 23:జమ్మూకశ్మీర్‌లోని కథువా జిల్లాలో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాకిస్తాన్ కు చెందిన ఉగ్రవాది హతమయ్యాడు. జమ్మూ-కాశ్మీర్ పోలీసులు జరిపిన కాల్పుల్లో ఉగ్రవాది హతమయ్యాడని ఇన్స్పెక్టర్ ఆఫ్ జనరల్ పోలీసల్ భిమ్ సేన్ టుటి తెలిపారు.

ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. జమ్మూకశ్మీర్‌లోని కథువా జిల్లా, బిలావర్ ప్రాంతంలో భారత ఆర్మీ, సీఆర్పీఎఫ్ జవాన్లు సంయుక్త ఆపరేషన్ చేపట్టారు. ఇంటెలిజెన్స్ నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు ప్రత్యేకసోదాలు చేపట్టారు. ఈ ప్రాంతాన్ని జవాన్లు చుట్టుముట్టి గాలించగా.. తీవ్రవాది గుర్తించి మన భద్రతా సిబ్బందిపై కాల్పులు జరిపాడు. వెంటనే భారత దళాలు ఉగ్రవాదిపై ఎదురు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో పాకిస్తాన్ కు చెందిన ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్ కమాండర్ అయిన ఉస్మాన్ అనే ఉగ్రవాది మరణించాడు.

అతడివద్ద నుంచి ఎం4 ఆటోమేటిక్ రైఫిల్, ఇతర ఆయుధాల్ని భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. ఇంకా ఈ ప్రాంతంలో సోదాలు కొనసాగుతున్నాయి. ఉగ్రవాదులు ఎవరైనా ఉన్నారా అనే కోణంలో గాలింపు చర్యలు చేపట్టారు.

# తిరువనంతపురం-చర్లపల్లి మధ్య అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం




తిరువనంతపురం, జనవరి 22: మూడు అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు ఓ ప్యాసింజర్ రైలును ఇవాళ ప్రధాని మోదీ ప్రారంభించారు. తిరువనంతపురంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఆ రైళ్లను స్టార్ట్ చేశారు. ఈ నేపథ్యంలో తిరువనంతపురం నుంచి చర్లపల్లి వరకు వచ్చే అమృత్ భారత్ రైలును కూడా ప్రారంభించారు. దీనితో పాటు నాగర్‌కోయిల్-మంగుళూరు, తిరువనంతపురం-తాంబరం మధ్య కొత్త అమృత్‌భారత్ రైళ్లు నడవనున్నాయి. త్రిసూరు నుంచి గురువాయూర్ మధ్య నడిచే ప్యాసింజర్ రైలును కూడా ప్రారంభించారు. ఈ రైళ్ల ద్వారా కేరళ, తమిళనాడు, కర్నాటక, తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు సర్వీసులు అందుబాటులో ఉండనున్నాయి.

చర్లపల్లి నుంచి అమృత్‌భారత్ రైలు ప్రతి మంగళవారం ఉదయం 7.15 నిమిషాలకు బయలుదేరుతుంది. ఆ రైలు బుధవారం మధ్యాహ్నం 12.45 నిమిషాలకు తిరువనంతపురం చేరుకుంటుంది. ఇక తిరువనంతపురం నుంచి ప్రతి బుధవారం సాయంత్రం 5.30 నిమిషాలకు రైలు బయలుదేరుతుంది. గురువారం రాత్రి 11.30 నిమిషాలకు ఆ రైలు చర్లపల్లి చేరుకుంటుంది.

# క్రీడాపోటీలు యువత క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తాయి : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



హైదరాబాద్, జనవరి 23: క్రీడాపోటీలు యువత క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గంధం నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో రామంతాపూర్ చిన్నచెరువులో ఏర్పాటు చేసిన బీఎల్ఆర్ క్రికెట్ పోటీలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత క్రీడలపై మరింత ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఈక్రీడల వలన శారీరక ధారుఢ్యాన్ని పెంచడమే కాకుండా మానసిక ఉల్లాసాన్ని పెంచుతాయన్నారు. అనంతరం గంధం నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ క్రికెట్ పోటీలకు పరిసర ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా ముందుకువచ్చారన్నారు. ఈనెల .25 తేదీ వరకు క్రీడలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పసుల ప్రభాకర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, బాల్‌రాజ్ యాదవ్, ఆకుల మహేందర్, డాక్టర్ బివి చారి, సూరంశంకర్, సంధ్య, మంజుల, తదితరులు పాల్గొన్నారు.


# గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

అమరావతి, జనవరి 23:: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన కట్టంగూర్ గ్రామ శివారులో 65వ జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి చోటుచేసుకొంది. ఆంధ్రప్రదేశ్ లోని ఎన్టీఆర్ కృష్ణా జిల్లా చందర్లపాడు మండలం కోనాయిపాలెం గ్రామానికి చెందిన గడ్డం వెంకట్ (29) వృత్తిరీత్యా డ్రైవర్. గత 15 ఏళ్లుగా కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ లో నివాసం ఉంటున్నాడు. వెంకట్ సంక్రాంతి పండుగకు ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్లి గురువారం రాత్రి తిరిగి హైదరాబాద్ కు బయల్దేరాడు.

మార్గమధ్యంలో కట్టంగూర్ గ్రామ శివారులోని మద్రాసు ఫిల్టర్ కాఫీ దాటిన తర్వాత ముందున్న వాహనాన్ని దాటే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు రోడ్డుపై పడ్డాడు. దీంతో అదే క్రమంలో వెళ్తున్న గుర్తు తెలియని వాహనం వెంకట్ పై నుండి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వెంకట్ తల్లి యశోధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మునుగోటి రవీందర్ తెలిపారు.

# టీటీడీకి హైదరాబాద్ సంస్థ రూ.2.50 కోట్లు విరాళం



తిరుపతి, జనవరి 22: హైదరాబాద్ కు చెందిన పి.ఎల్.రాజు కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్ సంస్థ శుక్రవారం టీటీడీలోని వివిధ ట్రస్టులకు రూ.2.50 కోట్లు విరాళంగా అందించింది. శ్రీవేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.75 లక్షలు, శ్రీవేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు రూ.75 లక్షలు, బర్డ్ ట్రస్టుకు రూ.50 లక్షలు, శ్రీవేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.25 లక్షలు, శ్రీవేంకటేశ్వర గో సంరక్షణ ట్రస్టుకు రూ.25 లక్షలు విరాళంగా అందించింది.

ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధి రాజ గోపాల రాజు రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

# మానవుల్లో జ్ఞానాన్ని ప్రసాదించే రోజే వసంత పంచమి :సిద్ధేశ్వరానంద గిరి

మెదక్, జనవరి 23: వసంత పంచమి కేవలం పండుగ మాత్రమే కాకుండా, మానవ జీవితాల్లో జ్ఞాన వసంతాన్ని నింపే పవిత్ర దినమని బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతి మహామండలేశ్వర్ సిద్దేశ్వరానంద గిరి మహారాజు తెలిపారు. అజ్ఞానం అనే అంధకారాన్ని తొలగించి జ్ఞానం అనే వెలుగును ప్రసాదించేదే శుభదినమని పేర్కొన్నారు. శుక్రవారం వసంత పంచమి సందర్భంగా సంగారెడ్డి పట్టణం లోని దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం చేపట్టారు. దత్తాత్రేయ మందిర నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు.

వసంత ఋతువు ప్రకృతికి పుష్పాలను అందిస్తే, వసంత పంచమి మన జీవితాలకు సద్గుణాలు, సృజనాత్మకతను అందిస్తుందని మహారాజు వివరించారు. ఆలయంలో జరుగుతున్న రాజశ్యామల దేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమాలకు సంగారెడ్డి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తుల కోసం ఉత్సవ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

# రాజకీయాలకతీతంగా అభివృద్ధి, సంక్షేమం : ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ,జనవరి 23 : పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. జమాల్‌బస్తీ ప్రాంతానికి చెందిన వేణు గత కొన్ని నెలలుగా ఆరోగ్యం బాగలేకపోవడంతో మెరుగైన చికిత్స నిమిత్తం దవాఖానకు వెళ్లగా ఇటీవల ఆరోగ్యం కుదుటపడింది. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బీమాగౌని కృష్ణాగౌడ్ చొరవతో శుక్రవారం వేణుకు లక్ష రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఎల్ఓసీని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఎమ్మెల్యే అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గాన్ని ఒకపక్క అభివృద్ధి, మరో పక్క సంక్షేమం రెండింటిని సమర్థవంతంగా అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేయడంలో పొరుగు రాష్ట్రాల కంటే తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచిందన్నారు.

# టీపాడ్ అధ్యక్షురాలిగా వరుసగా మూడోసారి మహిళకే పట్టం

న్యూఢిల్లీ, జనవరి 23: డల్లాస్, టెక్సాస్‌లో శక్తివంతమైన, ప్రభావవంతమైన తెలుగు సంస్థగా అక్కడి తెలుగు ప్రజల మన్ననలు పొందుతున్న ‘డల్లాస్ తెలంగాణ ప్రజా సమితి’ అధ్యక్షు రాలిగా మరోసారి మహిళనే ఎన్నుకున్నారు. 2026 సంవత్స రానికి ఏర్పడ్డ నూతన కార్యవర్గ బృందం బాధ్యతలు స్వీకరిం చింది.

టీపాడ్ బలమైన సంస్థాగత నిర్మాణం ద్వారా అనేక మందిని నాయకులుగా తీర్చిదిద్దడంతో పాటు ,సమాజ సేవ, సంస్కృతి పరిరక్షణకు అహర్నిశలు కృషి చేస్తోంది. టీప్యాడ్, ఫ్రిస్కో, టెక్సాస్‌లోని ఎలిగెన్స్ బాల్‌రూమ్‌లో స్థానిక కమ్యూనిటీ నాయకులు, మద్దతుదారుల సమక్షంలో తన 13 వ ఎగ్జిక్యూటివ్ టీమ్ తో ప్రమాణస్వీకారం చేయించింది.

ఈ సందర్భంగా టీప్యాడ్ అధ్యక్షురాలిగా లక్ష్మి పోరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మహిళలే అధ్యక్ష పీఠాన్ని అధిరోహించడం ఇది వరుసగా మూడోసారి కావడం విశేషం. ఫౌండేషన్ కమిటీ సభ్యుడు రావు కల్వాల, రఘువీర్ బండారు, అజ య్ రెడ్డి లు ప్రమాణ స్వీకారం చేయించారు.

లక్ష్మి పోరెడ్డి (అధ్యక్షురాలు), శ్రీనివాస్ అన్నమనేని (ఉపాధ్యక్షుడు), గాయత్రి గిరి (కార్యదర్శి), శివ కొడిత్యాల (సహ కార్యదర్శి), ఆదిత్య రెడ్డి , దీపిక దీపికా రెడ్డి (సహ ఖజాంచీ)లు ఎన్నికయ్యారు. నూతన ఈసీ సభ్యులుగా బాల గణపవరపు, మాధవి ఓంకార్, శ్రవణ్ కుమార్ నిడిగంటి, హారిక పల్వాయి, సాధన రెడ్డి, ధాత్రి బల్లమూడి, బద్రి బియ్యపు, తిలక్ కుమార్ వన్నంపుల, జనకిరామ్ మండాది ప్రమాణం చేశారు.

అదేవిధంగా నూతనంగా నియమితులైన బోర్డ్ సభ్యులు రవి కాంత్ మామిడి, అశోక్ పొద్దుటూరి, రోజా అడెపు, మాధవి సుంకిరెడ్డి, రామ్ అన్నాడి, అశోక్ కొండాల, పాండు రంగ రెడ్డి పల్వాయి, బుచ్చి రెడ్డి గోలితో ప్రమాణ స్వీకారం చేయించారు. బీవోటి చైర్మన్‌గా రవికాంత్ మామిడి , కో ఆర్డినేటర్‌గా లింగా రెడ్డి ఆల్వా , వైస్ చైర్‌గా రోజా అడెపు ప్రమాణ స్వీకారం చేశారు.

# విద్యార్థి కేంద్రిత నైపుణ్య విద్య ఇస్తున్నామా !

## (24 జనవరి "అంతర్జాతీయ విద్యా దినోత్సవం" సందర్భంగా)

ప్రపంచ మానవాళి చరిత్రను మార్చి సానుకూలంగా వ్రాయగలిగేది నేటి విద్యావేత్త తరం మాత్రమే. ప్రపంచ దశ దిశలకు మార్చగలిగే సామర్థ్యం విద్యావంతులకు ఉంటుంది. రేపటి సమాజ స్థితిగతులను నిర్ణయించే శక్తియుక్తులు నేటి మేధావులు, శాస్త్రజ్ఞులకు మాత్రమే ఉంటుందని గత చరిత్ర ఏకరువు పెడుతున్నది. ప్రతి విద్యావంతుడు ఓ మహత్తర శక్తి అవుతాడు. మేధావి ఒక వ్యక్తి కాదు, ఆయన ఒక శక్తివంతమైన వ్యవస్థ. సమాజ గతిని తమకు అనుకూలంగా మార్చగలిగే ధీరుడు విద్యావేత్త. విద్య లేని వాడు వింత పశువు అన్నారు. కత్తి కన్న కలం గొప్పది అని కూడా విన్నాం. దేశాభివృద్ధిని విద్యావంతుల సంఖ్యతో ప్రమాణీకరించడం పరిపాటి అయ్యింది. వ్యక్తి, కుటుంబ, దేశ, ప్రపంచ ప్రగతికి బాటలు వేయగలిగేది నాణ్యమైన విద్య మాత్రమే. విద్యతో వివేకం తోడైతే ప్రపంచం మనకు సలాం కొడుతుంది. బుద్ధిలేని నిరక్షరాస్యుడి కన్న అనైతిక విద్యావంతుడు అతి ప్రమాదకరం కాబట్టి విద్యతో పాటు మానవీయ విలువలు కూడా తోడు కావాలి. నేడు బాలురతో పాటు బాలికల విద్యకు సమాన ప్రాధాన్యం ఇవ్వబడుతున్నది. మహిళ/బాలికల నిర్బంధ ఉచిత విద్యకు పెద్ద పీట వేయాలి. చదువు, నైపుణ్యాల ద్వారానే మానవ సంస్కృతీ వారసత్వాలు వెలుగొందుతాయి నమ్మాలి.

విద్య ప్రయోజనాలు అనేకం:

విద్య ప్రయోజనాల జాబితాలో వ్యక్తిత్వం వికాసం, ఆకర్షణీయ వేతనంతో కూడిన ఉద్యోగం, సమాజాన్ని జాగృత పరచడం, పేదరికాన్ని తరిమేయడం, అసమానతలను తొలగించడం, నాణ్యమైన జీవితాన్ని గడపడం, మానవీయ విలువలను జీర్ణించుకోని ఆచరణలో పెట్టడం, సమాజంలో గౌరవాన్ని పొందడం, కుటుంబ అభివృద్ధికి దోహదపడడం, చక్కటి జీవనశైలిని పాటించడం, ఆలోచనల్లో విస్తృతి కలగడం, సంభాషనాచాతుర్యం పెరగడం, నాయకత్వ లక్షణాలు అలవడడం, శారీరక మానసిక సమతుల్యత సాధించడం, సన్మార్గంలో నడుస్తూ ప్రజలకు దిశ నిర్దేశనం చేయడం, సద్గుణాలను ఆకలింపు చేసుకోవడం, నైపుణ్యాలను వంటపట్టించుకోవడం, సరైన ప్రశ్నలకు ధీటైన సమాధానాలు ఇవ్వగలగడం, ఆత్మవిశ్వాసం పెరగడం, సమాజంలో గౌరవం లభించడం, తార్కిక విశ్లేషణలు చేయగలగడం, ఆర్థిక ప్రగతి నమోదు కావడం, సామాజిక చైతన్యం, సాంకేతిక విప్లవం, సృజనశీల ఆలోచనలు జనించడం, ఆవిష్కరణలకు ఊతం ఇవ్వడం, దేశాభివృద్ధిని కాంక్షించడం లాంటి అనేక ఉపయోగాలు ఉన్నాయి.

అంతర్జాతీయ విద్యా దినోత్సవం-2026 ఇతివృత్తం::

"విద్యార్థి కేంద్రిత విద్య" లేదా "స్టూడెంట్ సెంట్రిక్ ఎడ్యుకేషన్'' ప్రాధాన్యతను ప్రచారం చేయడం, సృజనశీలతను ఆహ్వానించడం, విలక్షణ ఆలోచనలకు ఊతం ఇవ్వడం, సమ్మిళిత విద్యా విధానానికి పునాదులు వేయడం, నైపుణ్యాల పెంపుకు పట్టం కట్టడం, వ్యక్తిని మహత్తర శక్తిగా మార్చగలగడం నేటి విద్యా విధానానికి ఊపిరి కావాలి. విషయ పరిజ్ఞానానికి నైపుణ్యం తోడైతేనే వ్యక్తి సాంకేతిక ప్రతిభ మానవాళి శ్రేయస్సుకు దోహదపడుతుంది. నైపుణ్యం లేని విద్య సువాసన లేని పువ్వులాంటిదే అని గమనించి నేటి యువత విద్య, వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాలను సమాంతరంగా ఒట్టపట్టించుకోవాలి. విద్య ప్రాధాన్యాన్ని ప్రచారం చేయడానికి ప్రతి ఏట 24 జనవరి రోజు "అంతర్జాతీయ విద్యా దినోత్సవం" పాటించడం 2018 నుంచి ఆనవాయితీగా మారింది. ఈ వేదికగా విద్య ప్రాధాన్యాన్ని వివరించే సదస్సులు/కార్యశాలలు, కమ్యూనిటీ కార్యక్రమాలు, రీడించ్ హాబిట్‌ను పెంచడం, విద్యావేత్తలను గుర్తించడం, విద్యలో రాణించిన యువతను సన్మానించడం, విద్యార్థులకు విద్య ప్రాధాన్య అంశాల్లో పోటీలు నిర్వహించడం లాంటి పలు కార్యక్రమాలు నిర్వహించవచ్చు. అంతర్జాతీయ విద్యా దినోత్సవం-2026 ఇతివృత్తంగా "విద్య సహ-సృష్టిలో యువశక్తి (ది పవర్ ఆఫ్ యూత్ ఇన్ కో-క్రియోటింగ్ ఎడ్యుకేషన్)'' అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు.

3వ అతి పెద్ద భారత విద్యా వ్యవస్థ:

నేటి ఆధునిక డిజిటల్ ఏఐ యుగంలో భారత ప్రభుత్వం విద్యా ప్రాధాన్యాన్ని గుర్తించి సర్వశిక్షా అభియాన్, డిజిటల్ ఇండియా ఇనిషియేటివ్, నూతన విద్యా విధానం-2000 లాంటి పలు కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తున్నారు. నేడు భారత్‌లో అక్షరాస్యత రేడు 77.7 శాతం మాత్రమే ఉన్నది. మన దేశంలో అక్షరాస్యత రేటు కేరళలో అత్యధికంగా 96.9 శాతం, అత్యల్పంగా బీహార్‌లో 61.8 శాతం నమోదు అవుతున్నది. తెలంగాణలో 72.8 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 66.8 శాతం అక్షరాస్యత రేటు నమోదైంది. గ్రామీణ భారతంలో 73.5 శాతం, పట్టణ ప్రాంతాల్లో 87.7 శాతం అక్షరాస్యత నమోదు అవుతుండగా, పురుషుల్లో 84.7 శాతం, మహిళల్లో 70.3 శాతం నమోదు అవుతున్నది. ప్రపంచంలో 3వ అతి పెద్ద విద్యా వ్యవస్థ కలిగిన భారతంలో మొత్తం 1,338 యూనివర్సిటీలు, 70,000లకు పైగా ఉన్నత విద్యా కళాశాలలు/సంస్థలు ఉన్నాయి. అందులో 56 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, 483 రాష్ట్ర యూనివర్సిటీలు, 146 డీమ్డ్ యూనివర్సిటీలు, 529 ప్రైవేట్ యూనివర్సిటీలు, 1.5 మిలియన్ల పాఠశాలలు ఉన్నాయి. పాఠశాల విద్యను 260 మిలియన్లు అభ్యసిస్తున్నారు. భారత ఉన్నత విద్యలో స్థూల నమోదు నిష్పత్తి 28.4 శాతంగా నమోదు అవుతున్నది. ప్రతి లక్ష జనాభాకు బీహార్‌లో 7 కళాశాలలు, తెలంగాణలో 59 కళాశాలలు ఉండగా దేశంలో సగటున 28 కళాశాలలు ఉన్నాయి. విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తి అమెరికాలో 13:1, చైనాలో 20:1 ఉండగా భారత్‌లో మాత్రం 30:1గా ఉన్నది. దేశంలో 30 శాతం కళాశాలలు మాత్రమే గుర్తింపు పొందగా, 45 శాతం యూనివర్సిటీలు మాత్రమే గ్రేడ్స్ పొందాయి. ప్రపంచ అత్యుత్తమ 1000 యూనివర్సిటీల్లో భారత్‌కు చెందిన 91 యూనివర్సిటీలు ఉన్నట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

భారత్‌లో విద్యా వ్యవస్థ కొంత వరకు గాడి తప్పినట్లు, నాణ్యతలకు తిలోదకాలిస్తూ, నైపుణ్య విద్యను గంగలో కలపడం వల్ల భారత యువత నిరుద్యోగ కోరల్లో చిక్కి అసహనాన్ని, ఆవేశాన్ని, అశాంతిని వ్యక్తం చేస్తున్నది. గుణాత్మక విద్యను త్యాగం చేస్తూ పరిమాణాత్మక మెరుపులకే మురిసి పోతున్న భారతీయ విద్యా వ్యవస్థను పట్టాలపైకి తీసుకురావలసిన సమయం ఆసన్నమైంది. యువ భారతానికి డిజిటల్ మెరుగులు దిద్ది, నైపుణ్య బుద్ధులు నేర్పి అంతర్జాతీయ స్థాయి టెక్నోక్రాట్స్, సైంటిస్టులు, అధ్యాపకులు, పలు రంగాల్లో శాసించగల మేధావులను తయారు చేసే నూతన గుణాత్మక విద్య విధానం కావాలని, ప్రభుత్వాలు ఆ దిశలో పటిష్ట అడుగులు వేయాలని కోరుకుందాం. అందరికీ అంతర్జాతీయ విద్యా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.



- ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# కాలచక్రాన్ని జయించిన పద్మశాలీలు అత్యంత ప్రతిభాశీలురు

-చైతన్యవంతమైన పద్మశాలీలు ప్రస్తుత సమాజానికి మరింత దిశానిర్ధేశం చేయాలి
-ఉప్పల్ శాసనసభ్యులు బండారు లక్ష్మారెడ్డి
-చిలుకా నగర్ లో ఘనంగా 'మార్కండేయ' జయంతి వేడుకలు



హైదరాబాద్ జనవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );పద్మశాలీల ఆరాధ్య దైవం 'భక్త మార్కండేయ" జయంతి కార్యక్రమాన్ని 'చిలుకా నగర్ పద్మశాలి సంఘం' ఆధ్వర్యంలో స్థానిక మార్కండేయ మందిరంలో ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు సకినాల ప్రసాద్ అధ్యక్షతన ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం పెద్దలు, కులబాంధవులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. కాలచక్రాన్ని జయించిన మార్కండేయుని వంశంలో పుట్టిన పద్మశాలీలు అత్యంత గొప్పవారు, ప్రతిభాశీలురని అన్నారు. ఎంతో చైతన్యవంతమైన పద్మశాలీలు ప్రస్తుత సమాజానికి మరింత దిశానిర్ధేశం చేయాలన్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు బండారు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, తాను తొలిసారిగా మార్కండేయ దేవాలయాన్ని సందర్శించినట్లు, భక్త మార్కండేయ స్వామి కృపా కటాక్షాలు తనపై మెండుగా ఉన్నాయని తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరైనందుకు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ, స్థానిక పద్మశాలి సంఘం విజ్ఞప్తి మేరకు మార్కండేయ దేవాలయంలో ఖాళీ స్థలంలో పై కప్పు రేకుల తో పూర్తిస్థాయి పనులు చేపట్టి పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. పద్మశాలి సమాజ సంక్షేమానికి, అభివృద్ధికి తాము నిరంతరం సహకరిస్తామని నాయకులు తెలిపారు. మార్కండేయ ఆలయ అభివృద్ధికి సైతం సహకరిస్తామన్నారు. అనంతరం సంగీశెట్టి శ్రీధర్ కుటుంబ సభ్యుల చేతుల మీదుగా అన్నప్రసాద వితరణ ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా, క్రమబద్ధంగా నిర్వహించబడినందుకు స్థానిక ప్రజలు, భక్తులు నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ,ఎంబీసీ కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ తాడూరి శ్రీనివాస్ , ఉప్పల్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ దేవసాని బాలచందర్, తెలంగాణ పద్మశాలి మహాసభ కన్వీనర్ భారత సుదర్శన్, సీనియర్ జర్నలిస్టు,బొల్లిగూడ పద్మశాలి సంఘం ముఖ్య సలహాదారు డాక్టర్ మహేశుని లక్ష్మయ్య నేత , వడ్డేపల్లి కిశోర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి పెండెం నాగార్జున, అడ్డగట్ల భవానంద్, దాసరి శ్రీనివాస్, గూడ శ్రీశైలం, కోడెం రమేష్, దేవసాని బాలచందర్, చేర్యాల శ్రీనివాన్, నర్సింగ్ నేత,గూడ శ్రీశైలం, ప్రభాకర్, సకినాల చందు, సబ్బని సతీష్, యువనేత పాము రాజేష్, గుంజరి కుమార్,దేవసాని వివేక్,రాచకొండ శివకుమార్, సత్యనారాయణ, చంద్రశేఖర్, ప్రసాద్, రాజేష్, ప్రవీణ్, కుమార్, సకినాల శ్వేత, మౌనిక, అమారేశ్వరి, రేణుక, చిన్నారులు, స్థానిక ప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు. చిల్కానగర్‌లో భక్తి, ఐక్యత, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా విజయవంతంగా ముగిశాయి.

## సంగారెడ్డి మున్సిపాలిటీలో రూ 31.70 కోట్ల తో అభివృద్ధి పనులు

**-13 వార్డు ల్లో స్థానిక నాయకులతో కలిసి అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేసిన టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి**

సంగారెడ్డి జనవరి 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సంగారెడ్డి మున్సిపాలిటీ లో 31.70 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి శంకుస్థాపనలు చేశారు. మున్సిపాలిటీ పరిధి లోని 13 వార్డుల్లో స్థానిక నాయకులతో కలిసి ఆమె కొబ్బరి కాయ కొట్టి లాంఛనంగా శంకుస్థాపన చేశారు. రూ.31.70 కోట్ల ఊఓఅం, జఎఅఈ నిధుల తో సంగారెడ్డి మున్సిపాలిటీ లో పలు వార్డుల్లో సిసి రోడ్లు , డ్రైన్ లతో పాటు 3 కోట్ల రూపాయల తో రాజీవ్ పార్క్ సుందరీకరణ, 2 కోట్లతో రాజంపేట నుండి ఈద్గా వరకు ఫిల్టర్ బెడ్ రోడ్ నిర్మాణానికి ఈ రోజు శంఖుస్థాపన లు చేశారు. ఈ కార్యక్రమం లో టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బోంగుల రవి, అశోక్ రెడ్డి, కూన సంతోష్, షఫీ హఫీజ్, కిరణ్ గౌడ్, మహేష్, శ్రీకాంత్ గౌడ్, ఆయా వార్డుల నాయకులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు కట్టుబడి ఉంటాం

**-తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్**

హైదరాబాద్ జనవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); పేదల ఆకలి తీర్చే పథకం "మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని" అమలు చేసే వరకు అలుపెరగని పోరాటం చేస్తామని, తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. గురువారం నాడు గాంధీభవన్ లో జరిగిన ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెసు పార్టీ కార్యకర్తలమైన తాము పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, పేదల ఆకలి తీర్చే మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ అమలు చేసే వరకు అలుపెరగని పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. వెనకబడిన తరగతుల( బీసీల) బిడ్డల భవితవ్యానికి అలుపెరగని పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. తమ ఆరాధ్య దైవం కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సోనియా గాంధీ ఆశయాలు, భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ లక్ష్యాల మేరకు ఆ లక్ష్యాలను చేరుకునే వరకు, తమ పోరాటం కొనసాగిస్తామని ఇందుకు పార్టీలోని కిందిస్థాయి కార్యకర్తలు సహకరించి రానున్న మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని విజయ తీరాల వరకు నడిపించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఐసిటి ఓబీసీ కోఆర్డినేటర్లు లేక్ రామ్ సాహు, జి, సంజయ్ పాలాజీ , కాంగ్రెస్ పార్టీ పిసిసి చీఫ్ బి. మహేష్ కుమార్ గౌడ్, పాల్గొని తమ సందేశాలు అందజేశారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ విభాగ జాతీయ అధ్యక్షులు అనిల్ జైహింద్ జారీ చేసిన ఆదేశాల మేరకు, కార్యక్రమాన్ని రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ, స్థాయిలో సక్రమంగా సమర్థవంతంగా నిర్వహించి అమలు చేయడం జరుగుతుందని వక్తలు పేర్కొన్నారు. భాగ్యనగరంలో త్వరలో జరిగే జాతీయస్థాయి ఓబీసీ మహాసభకు లోక్ సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ హాజరుకానున్నారని, ఇందుకు మనం పెద్ద ఎత్తున ఆయనకు స్వాగతం పలకాలని సమావేశంలో తీర్మానం చేశారు. అదేవిధంగా ఇటీవల నిర్వహించిన సర్పంచ్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన అభ్యర్థులకు అవకాశాలు కల్పించినందుకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బి మహేష్ కుమార్ గౌడ్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి సభా సమావేశం హృదయపూర్వక కృతజ్ఞతలు అందజేసింది. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు ( బీసీలకు) ఓబీసీలకు నిబద్ధతతో సేవలు అందజేసిన నాయకులకు విస్తృత ప్రాతినిధ్యం కల్పించేందుకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. వెనుకబడిన తరగతుల కు ప్రభుత్వ నామినేటెడ్ పదవులు 42 శాతం కేటాయింపుకు కృషి చేస్తామని దానికి అత్యున్నత ప్రాధాన్యత కల్పించడం తమ లక్ష్యం అని అన్నారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లాల బాధ్యులు, పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి : సర్పంచ్ ఎల్లమ్మ

నల్గొండ, జనవరి 23:పరి సరాలను పరిశుభ్రంగా ఉంచా లని కనగల్ మండలం దోరేపల్లి గ్రామ సర్పంచ్ బక్క ఎల్లమ్మ అన్నారు. గురువారం దోరేపల్లిలో ఎన్ఎస్ఎస్ యూనిట్ -1 ఆధ్వర్యంలో వాలంటీర్స్ పాఠశాల, గ్రామ రోడ్ల వెంబడి ఉన్న కంప చెట్లు, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. అలాగే మురుగు కాల్వలో ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎల్లమ్మ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలపై అవగాహన కల్పిస్తూ పరిసరాల పరిశుభ్రతను గూర్చి ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలన్నారు.పగిడిమర్రి గ్రామంలో ఎన్ఎస్ఎస్ యూనిట్- 6 ఆధ్వర్యంలో వాలంటీర్లు గ్రామ రోడ్ల వెంట ఉన్న కంప చెట్లు తొలగించి రహదారుల వెంబడి పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలను చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ప్రోగ్రాం ఆఫీసర్ నర్సింగ్ కోటయ్య, యూనిట్ సిక్స్ ప్రోగ్రాం ఆఫీసర్ కంబాలపల్లి శివరాణి, అధ్యాపకులు కె.నాగరాజు, పంచాయతీ కార్యదర్శి గణేశ్, పగిడిమర్రి గ్రామ సర్పంచ్ నాగవల్లి నాగమణి, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం మోహన్ రావు, బక్క రాజశేఖర్ పాల్గొన్నారు.

**ఆహ్వానం**

అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ హైదరాబాద్ మరియు విశ్వసాహితి
సంయుక్తంగా నిర్వహిస్తున్న
"కళాప్రపూర్ణ" "కృష్ణానంద" డాక్టర్ పోతుకుచి సాంబశివరావు గారి
జయంతి మహోత్సవం మరియు కవిగాయక సమ్మేళనం

తేది : 27-1-2026, మంగళవారం ఉ॥ 10.30 గం॥లకు
వేదిక : అశోక్ నగర్ సంస్కృతి కేంద్రం, అశోక్‌నగర్, హైదరాబాద్-500020.

**సభా కార్యక్రమం**

ముఖ్య అతిథులు : డా॥ ఏనుగు నరసింహారెడ్డి గారు
సంచాలకులు, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ

సభాధ్యక్షులు : ఆచార్య కడారి సత్యమూర్తి
అధ్యక్షులు - ఎబిబిఎస్ఎస్, హైదరాబాద్

విశిష్ట అతిథులు : ఆచార్య టి. గౌరీ శంకర్ గారు
పూర్వ రిజిస్ట్రార్, తెలుగు విశ్వవిద్యాలయము

ఆత్మీయ అతిథులు: శ్రీ బైసా దేవదాస్ గారు సంపాదకులు, నేటినిజం

కార్యక్రమ నిర్వహణ: శ్రీమతి గోళ్లమూడి పద్మావతి
అధ్యక్షులు, మహిళా విభాగం ఎబిబిఎస్ఎస్
శ్రీ ఎన్.వి. రఘువీర్ ప్రతాప్
ప్రధాన కార్యదర్శి, ఎబిబిఎస్ఎస్

**అతిథులచే కవులకు సత్కారం**
కవులు తమ పేర్లు ఈ క్రింది ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని మనవి)
ఫోన్ నెంబర్లు : 9618895543, 9440551552

**కార్యవర్గం :**
అఖిల భారతీయ భాష సాహిత్య సమ్మేళన్, హైదరాబాద్

## సమాజములో దోపిడి వ్యవస్థ సమూలంగా పోవాలి

హైదరాబాద్ (నార్సింగి) జనవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు తలపెట్టిన మీ సమస్య - మా బాధ్యత, ప్రజలతో - ప్రజలకోసం కార్యక్రమంలో భాగంగా నార్సింగి రోడ్డు వినాయక నగర్, కులీ కుతుబ్ షాయి కాలనీ ప్రాంతాలు పర్యటించడం జరిగినది.దిగువ మరియు మధ్య తరగతి ప్రజానీకంలో భాగముగా ఒక చిన్న కిరాణా షాప్ లో పనిచేస్తున్న 70 ఏళ్ల వృద్ధురాలుని పలకరించి నప్పుడు ఆవిడ బాధ వర్ణనాతీతం, అనారోగ్య రీత్యా తమ కుటుంబ సభ్యుడు ఆసుపత్రికి వెళ్తే నాలుగు లక్షలు ఖర్చుయి ప్రభుత్వాలు చెప్పే ఆరోగ్యశ్రీ లేదా ఆయుష్మాన్ భారత్ లాంటి పథకాలు అందక ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి కేవలం 45 వేలే నోచుకొని మిగిలిన అప్పు తీర్చడం కోసం 70 ఏళ్ల వయసులో పనిచేసు కుంటున్నానని తెలిపింది. ప్రజా పాలన అని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం వికసిత్ భారత్ అని చెప్పే కేంద్ర ప్రభుత్వం స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు గడిచినప్పటికీ సామాన్యులకు సరైన వైద్య సదుపాయాలు అందజేయ లేని పరిస్థితి నెలకొందని వ్యధను వెళ్లబోసుకున్నారు.నార్సింగి రోడ్డు ఇరుకుగా ఉండి వాహనాల రాక పోకలతో, దుమ్ము ధులితో ప్రజల సతమత మౌతున్నారని, అందుకు తోడుగా కొన్ని చోట్ల వీధి దీపాలు వెలిగనీ కారణముగా మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు.

**-జిల్లా కలెక్టర్ ప్రావీణ్య.**

సంగారెడ్డి, జనవరి 23 (నేటి నిజం ప్రతినిధి) జిల్లాలోని సంగారెడ్డి, సదాశివపేట, కోహి ర్, జహీరాబాద్, నారా యణఖేడ్, అందోలు-జోగిపేట, ఇస్నాపూర్, ఇంద్రేశం, జిన్నారం, గడ్డపో తారం, గుమ్మడిదల మున్సిపా లిటీల ఎన్నికలను ప్రశాంత వా తావరణంలో, సజావుగా నిర్వహి ంచేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు.

మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ త్వరలో విడుదల కానున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమి షనర్ రాణీ కుముదిని శుక్రవారం సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు జిల్లాలో అన్ని విధాలుగా సన్నద్ధంగా ఉన్నామని రాష్ట్ర ఎన్ని కల కమిషనర్ దృష్టికి తీసుకె ళ్లారు.

జిల్లాలోని 11 మున్ని పాలిటీల పరిధిలో మొత్తం 541 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పోలింగ్



కేంద్రాల వివరాలను ఇప్పటికే టీ-పోల్‌లో నమోదు చేయడం జరిగిందని, వచ్చిన అభ్యంతరాలను నిశితంగా పరిశీలించి పరిష్కరించినట్లు చెప్పారు.

ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమిస్తూ వారికి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

బ్యాలెట్ బాక్సులు, ఇతర ఎన్నికల సామాగ్రి అందు బాటులో ఉన్నాయని, షెడ్యూల్ విడుదలైన వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బందీ గా అమలు అయ్యేలా నిఘా ఉంచేందుకు ఎస్.ఎస్.టీ, ఎఫ్.ఎస్. టీ బృందాలను నియమిస్తున్నట్లు తెలిపారు. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రి, బ్యాలెట్ పేపర్ల ముద్రణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని, నామినేషన్ స్వీకరణ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాలలో కనీస మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. డిస్ట్రిబ్యూ షన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రా లను పరిశీలిస్తున్నామని తెలిపా రు.రిటర్నింగ్ అధికారులు, సహా య రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, జోనల్ అధికారుల నియామకానికి అవసరమైన సిబ్బందిని ఇప్పటికే గుర్తించడం జరిగిందన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయడంతో పాటు సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ లకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుము దిని మాట్లాడుతూ, ఎలాంటి తప్పి దాలకు తావు లేకుండా ఎన్నికల ను సాఫీగా, స్వేచ్ఛా యుతంగా నిర్వహించేందుకు ముందస్తుగా అన్ని చర్యలు తీసుకోవాలని సూచి ంచారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా నుండి మున్సిపల్ కమి షనర్లు, ఎన్నికల విభాగం అధికా రులు పాల్గొన్నారు.

# ఓయు ప్రొఫెసర్ మనోహర్‌ను సస్పెండ్ చేయడం అన్యాయం

**-బీసీలను సస్పెండ్ చేసి ప్రభుత్వం అవమానిస్తుంది**
**-యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్ పదవులు ఇవ్వకపోగా, ఉన్న ప్రొఫెసర్ ఉద్యోగాలు ఊడ గొడుతుంది**
**-బీసీలపై ప్రభుత్వం చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ప్రొఫెసర్ మనోహర్ ను విధుల్లోకి తీసుకోవాలి**
**-బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్**

హైదరాబాద్ జనవరి 23(ఎక్స్ క్యాష్) ప్రెస్ న్యూస్ ); ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అధ్యాపకు లుగా పని చేస్తున్న బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్ మనోహర్ ను అకారణంగా యూనివర్సిటీ యజమాన్యం సస్పెండ్ చేయడం చాల అన్యాయ మని అన్యాయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజు ల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

కెరీర్ అడ్వాన్స్మెంట్ స్కీమ్ ( అమలులో ప్రమోషన్ పొందని యూనివర్సిటీ అధ్యాం కుల తరపున ఉస్మానియా యూని వర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (ఔటా) గత యాభై రోజులుగా ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలియజేస్తున్న వారికి నాయక త్వం వహిస్తున్న ఆచార్య మనోహ ర్ రావు ను సస్పెన్షన్ చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు.

ప్రజాస్వా మ్యబద్ధంగా ఉ పాధ్యాయుల సమస్యలను వైస్ చాన్సలర్ ,రిజిస్ట్రార్ ల దృష్టికి తీసుకుపోయే బాధ్యత ఔట కు ఉ ందని, ఇవేవీ పరిగణలోకి తీసుకోకుండా, సమస్యలను పరిష్కరించకుండా సస్పెండ్ చేయడమే పరిష్కారం అనుకోవడం యజమాన్యానికి తగ దు అన్నారు.

ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీ ఐక్యతను దెబ్బతీయడానికి యూనివర్సిటీలో కొంతమంది, కొన్ని శక్తులు కుట్ర చేస్తున్నారని, దీనికి ఆజ్యం పోసే విధంగా యూనివర్సిటీ రిజిస్ట్రర్ నరేష్ రెడ్డి వ్యవహరిస్తున్నారని, దీనిని ఉపాధ్యాయ సమాజం గమనించి బిసి ఎస్సి ఎస్టి ఐక్యత దెబ్బతీసే విధంగా వ్యవహరిం చకుండా ఐక్యమ త్యంతో ఉ ండాలని జజూల సూచించారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోని ప్రొఫెసర్ మనోహర్ ను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమించాల్సి వస్తుందని జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు

# కేంద్ర ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో వివరించాలి

**-బిజెపి పార్టీ పదాధికారుల సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు**

హైదరాబాద్ జనవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అధ్యక్షతన పార్టీ పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రధానంగా రాష్ట్ర కమిటీల పనితీరుతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులకు బాధ్యతలు అప్పగించి నాలుగు నెలల ఫలితాలను సమీక్షించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో వివరించాలని రాంచందర్ రావు గారు దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా అనుబంధ విభాగాల పనితీరుపై కూడా రాంచందర్ రావు గారు సమీక్ష చేశారు. బిజెపి అగ్రనేతలతో రెండు ఉమ్మడి జిల్లాలకు ఒకటి చొప్పున ఐదు భారీ బహిరంగ సభలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. సింగరేణి, నైనీ కోల్ టెండర్ల విషయంలో రాష్ట్రం కోరితే సీబీఐ విచారణకు కేంద్రం సిద్ధంగా ఉందని తెలిపారు. సీబీఐ ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలం నుండి ఇప్పటివరకు జరిగిన అక్రమాలపై దర్యాప్తు జరగాలని బీజేపీ డిమాండ్ అని చెప్పారు. గతంలో దావోస్ పర్యటనకు వెళ్లిన సమయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన పెట్టుబడులు ఎక్కడ పెట్టారో, ఎంతమందికి ఉ ద్యోగాలు లభించాయో, అనే విషయాలు ప్రజలకు చూపించాలని సవాల్ విసిరారు. ఇప్పటికి రెండుసార్లు దావోస్ పర్యటనల్లో వచ్చిన పెట్టుబడులపై వైట్ పేపర్ (శ్వేతపత్రం) విడుదల చేయాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# తిరువనంతపురంలో సీఎస్ఐఆర్-ఎన్ఐఐఎస్టీ ఆవిష్కరణ, సాంకేతికత, వ్యవస్థాపక కేంద్రానికి శంకుస్థాపన చేయనున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జనవరి 23: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ జనవరి 23న కేరళ రాష్ట్రంలో పర్యటించనున్నారు. తిరువనంతపురంలో ఉదయం 10.45 గంటలకు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధానమంత్రి శంకుస్థాపనలు చేయడంతోపాటు కొన్నింటికి ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి శ్రీ మోదీ ప్రసంగిస్తారు.

ఈ ప్రాజెక్టుల్లో రైలు అనుసంధానం, పట్టణ జీవనోపాధి, విజ్ఞానం, ఆవిష్కరణలు, పౌర కేంద్రీయ సేవలు, అధునాతన ఆరోగ్య సేవలు లాంటి కీలక రంగాలు ఉన్నాయి. ఇవి సమగ్ర వృద్ధి, సాంకేతిక పురోగతి, పౌరుల జీవన ప్రమాణాల మెరుగుదలపై ప్రధానమంత్రి నిరంతర దార్శనికతను ప్రతిబింబిస్తాయి.

రైలు అనుసంధానానికి ప్రధాన ప్రోత్సాహకంగా.. నాలుగు కొత్త రైళ్లను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ జెండా ఊపి ప్రారంభించనున్నారు. వీటిలో మూడు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ఒక ప్యాసింజర్ రైలు ఉన్నాయి. వీటిలో నాగర్‌కో యిల్- మంగళూరు, తిరువనంత పురం-తాంబరం, తిరువనంతపురం-చర్లపల్లి మధ్య అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, అలాగే త్రిస్సూర్-గురువాయూర్ మధ్య ప్యాసింజర్ రైలు ఉన్నాయి. ఈ సేవల ప్రారంభంతో కేరళ, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య సుదూర, ప్రాంతీయ అనుసంధానం గణనీయంగా మెరుగుపడుతుంది. ప్రయాణీకులకు ఇది మరింత చౌకగా, సురక్షితంగా, సమయపాలనతో కూడిన ప్రయాణాన్ని అందిస్తుంది. మెరుగైన అనుసంధానంతో స్థానికంగా పర్యాటకం, వాణి జ్యం, విద్య, ఉపాధి, సాంస్కృతిక మార్పిడికి బలమైన ప్రోత్సాహాన్ని అందిస్తుంది.

పట్టణ జీవనోపాధిని బలోపేతం చేసే ప్రయత్నాల్లో భాగంగా పీఎం స్వానిధి క్రెడిట్ కార్డును ప్రధానమంత్రి ప్రారంభిం చనున్నారు. ఇది వీధి వ్యాపారుల ఆర్థిక మెరుగుదలకు సహాయపడనుంది. యూపీఐతో అనుసంధానించిన వడ్డీ లేని ఈ రివాల్వింగ్ క్రెడిట్ సదుపాయం తక్షణ నగదు లభ్యతను అందిస్తూ, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తుంది. లబ్ధిదారులు అధికారిక క్రెడిట్ చరిత్రను నిర్మించుకోవడంలో సహాయపడుతుంది. కేరళకు చెందిన వీధి వ్యాపారులు సహా లక్ష మంది లబ్ధిదారులకు పీఎం స్వానిధి రుణాలను కూడా ప్రధానమంత్రి పంపిణీ చేయనున్నారు. 2020లో ప్రారంభమైనప్పటి నుంచి పీఎం స్వానిధి పథకం ద్వారా అధిక సంఖ్యలో లబ్ధిదారులకు తొలిసారిగా అధికారిక రుణ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. పట్టణ అసంఘటితరంగ కార్మికుల్లో పేదరిక నిర్మూలనకు, జీవనోపాధి భద్రతకు ఈ పథకం కీలక పాత్ర పోషించింది.

విజ్ఞానం, ఆవిష్కరణల రంగంలో తిరువనంతపురంలోని పీఎస్ ఐఆర్-ఎన్ఐఐఎస్టీ ఆవిష్కరణ, సాంకేతికత, వ్యవస్థా పక కేంద్రానికి ప్రధానమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఇది లైఫ్ సైన్సెస్, బయో-ఎకానమీపై దృష్టి సారిస్తుంది. ఆయుర్వేదం వంటి సాంప్రదాయ జ్ఞాన వ్యవస్థలను ఆధునిక బయోటెక్నాలజీ, స్థిరమైన ప్యాకేజింగ్, గ్రీన్ [illegible]తో అనుసంధానిస్తుంది. అలాగే అంకుర సంస్థల ఏర్పాటు, సాంకేతిక బదిలీ, ప్రపంచ సహకారాన్ని ప్రోత్సహిస్తుంది. ఇది పరిశోధనలను మార్కెట్‌కు అనుగుణమైన పరిష్కారాలు, పరిశ్రమలుగా మార్చడానికి ఒక వేదికగా ఉపయోగపడుతుంది.

ఆరోగ్య మౌలిక సదుపాయాల బలోపేతం కూడా ప్రధానమంత్రి పర్యటనలో మరో ముఖ్యమైన అంశం.. తిరువనంతపురంలోని శ్రీ చిత్ర తిరునాల్ వైద్య విజ్ఞాన, సాంకేతిక సంస్థలో అత్యాధునిక రేడియో సర్జరీ కేంద్రానికి ప్రధానమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఈ కేంద్రం సంక్లిష్టమైన మెదడు సంబంధిత వ్యాధులకు అత్యంత ఖచ్చితమైన, అతి తక్కువ శస్త్రచికిత్సతో కూడిన చికిత్సను అందించి, ప్రాంతీయ ఆరోగ్య సేవల సామర్థ్యాన్ని మరింత పెంపొందించనుంది.

అదేవిధంగా తిరువనంతపురంలో కొత్తగా నిర్మించిన పూజప్పుర ప్రధాన తపాలా కార్యాలయాన్ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు. ఆధునిక సాంకేతికతతో కూడిన ఈ కార్యాలయం తపాలా, బ్యాంకింగ్, బీమా, డిజిటల్ సేవలను సమగ్రంగా అందిస్తుంది. తద్వారా పౌర కేంద్రీకృత సేవల పంపిణీని మరింత బలోపేతం చేస్తుంది.

# వందేమాతరం గేయానికి 150 ఏళ్ల వేడుకలు



న్యూఢిల్లీ, జనవరి 23:దేశవ్యాప్తంగా సామూహిక గీతాలాపన, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రఖ్యాత ప్రాంతాల్లో మిలిటరీ బ్యాండ్ ప్రదర్శనల ద్వారా జాతీయ గేయం 'వందేమాతరం' 150 ఏళ్ల వేడుకలను భారత్ నిర్వహిస్తోంది. దేశ గౌరవాన్ని, ఐక్యతను పెంపొందించటమే ఈ వేడుకల ప్రధాన లక్ష్యం.

ఈ వేడుకల్లో భాగంగా 31 మంది సంగీత విద్వాంసులతో భారత వైమానిక దళ (ఐఏఎఫ్) బ్యాండ్ జనవరి 21, 2026న న్యూఢిల్లీలోని రాజీవ్ చౌక్ యాంఫిథియేటర్ వద్ద ప్రదర్శన ఇచ్చింది. 45 నిమిషాల పాటు సాగిన ఈ ప్రదర్శనలో బ్రాస్, రీడ్, స్ట్రింగ్, ఎలక్ట్రానిక్ వాయిద్యాలతో పదకొండు అద్భుతమైన రాగాలను వినిపించారు. ఈ కార్యక్రమంలో వందేమాతరం గేయంతో పాటు ఆపరేషన్ సింధూర్ సమయంలో భారత సాయుధ దళాల పోరాటాన్ని స్మరిస్తూ రచించిన సింధూర్ గీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

శతాబ్దాలుగా సంగీతం, భారతీయ సంస్కృతిలో అద్భుతమైన ఆభరణంగా నిలిచింది. ఇది దేశ సుసంపన్న సైనిక వారసత్వంలో అంతర్భాగంగా ఉంటూ ఐక్యతను పెంపొందిస్తూ, శౌర్యాన్ని ఉత్తేజపరుస్తుంది. భారత వైమానిక దళ (ఐఏఎఫ్) బ్యాండ్1944లో ప్రారంభమైనప్పటి నుంచి భారతీయ, పాశ్చాత్య సంగీత మేళవింపుతో వైవిధ్యభరితమైన ప్రదర్శనల ద్వారా దేశ సైనిక సంప్రదాయానికి కీలక ఆధారంగా నిలుస్తుంది. ఆకట్టుకునే ప్రదర్శనల ద్వారా దేశభక్తిని పెంపొందించటం, ఐక్యతా స్ఫూర్తిని చాటటమే ఈ బ్యాండ్ లక్ష్యం.

# మంత్రి అనగాని సత్యప్రసాద్ సంస్కారం మరిచి మాట్లాడుతున్నారు

**-రెవెన్యూ వ్యవస్థ గురించి రెవెన్యూ మంత్రికి ఏమైనా తెలుసా**
**-మాజీ మంత్రి పేర్ని నాని**

విజయవాడ జనవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఎపి మంత్రి అనగాని సత్యప్రసాద్ సంస్కారం మరిచి మాట్లాడుతున్నారని వైసిపి మాజీ మంత్రి పేర్ని నాని తెలిపారు. మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి పై అవాకులు, చవాకులు పేల్చుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అనగాని ఎపి మంత్రి కావడం మన ఖర్మ అని విమర్శించారు. పాస్ పుస్తకాలపై జగన్ బొమ్మ వేసుకున్నారని, ఆ పాస్ పుస్తకాల్లో క్యూఆర్ కోడ్ ఓపెన్ కావడం లేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సర్వే చేసి ఒక్క పాస్ పుస్తకం అయినా ఇచ్చారా? అని ప్రశ్నించారు. జగన్ హయాంలో ఇచ్చిన పాస్ పుస్తకాలు తీసుకుని కొత్త పాస్ పుస్తకాలు ఇస్తున్నారని పేర్నినాని మండిపడ్డారు. రూ. 25 కోట్లు ఇస్తే పార్టీ మారతానని అనగాని సత్యప్రసాద్ అన్నారని, రూ.25 కోట్లు ఇవ్వడానికి ఆనాడు వైఎస్ జగన్ అంగీకరించలేదని తెలియజేశారు. రెవెన్యూ వ్యవస్థ గురించి రెవెన్యూ మంత్రికి ఏమైనా తెలుసా? అని ప్రశ్నించారు. తక్కెళ్ల పాడులో కూటమి ప్రభుత్వం మొదలు పెట్టిన సర్వే ఎందుకు కొనసాగించడం లేదు అని.. రెండెళ్లలో ఎవరి సమస్య తీర్చారు? అని నిలదీశారు. వైఎస్ జగన్ చేపట్టిన భూసర్వేను మీరెందుకు ఫాలో అవుతున్నారు అని జగన్ నిర్ణయాలు వాడుకుంటూ.. ఆయనపైనే విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ 6 వేల గ్రామాల్లో సమగ్ర భూసర్వే పూర్తి చేశారని, 6వేల గ్రామాల్లో సర్వే కోసం వాడిన ఎక్విప్ మెంట్ నే ఎపి సిఎం చంద్రబాబు నాయుడు వాడుతున్నారని పేర్ని నాని దుయ్యబట్టారు.

# సీపీఆర్ చేసి ప్రాణాలు నిలబెట్టిన హోంగార్డులు

బాసర జనవరి 23: బాసర పుణ్యక్షేత్రంలో వసంత పంచమి పురస్కరించుకొని అమ్మవారి దర్శనానికి వచ్చి క్యూలైన్లో వేచి ఉన్న భక్తుడు ఒక్కసారిగా అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు రక్షించాలని కోరడంతో అక్కడే విధుల్లో ఉన్న హోంగార్డులు ఇంద్రకరణ్ రెడ్డి, గణేష్ స్పందించి భక్తుడికి సీపీఆర్ చేసి ప్రాణాలు నిలబెట్టారు.

వివరాల్లోకి వెళితే మంచిర్యాల జిల్లాకు చెందిన భక్తుడు తిరుపతి కుటుంబ సమేతంగా అమ్మవారి దర్శనానికి బాసరకు విచ్చేశాడు. క్యూలైన్లో మూడు గంటలకు పైగా వేచి ఉండడంతో ఒక్కసారిగా పడిపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. విధుల్లో ఉన్న హోంగార్డులు ఇంద్రకరణ్ రెడ్డి గణేష్ చాకచక్యంగా భక్తుడు తిరుపతికి సి పి ఆర్ చేసి ప్రాణాలు నిలబెట్టారు.అనంతరం భక్తుడు తిరుపతిని వెంటనే అంబులెన్స్ కు సమాచా రం అందించి భక్తుడు తిరుపతిని అంబులెన్స్ లో బైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. భక్తుడి ఆరోగ్యం నిలకడగా ఉ ండడంతో ఆలయ సిబ్బంది ఊపిరి పీల్చుకు న్నారు. సరైన సమయంలో సీపీఆర్ చేసి ప్రాణాలను నిలబెట్టిన హోంగార్డులు ఇంద్రకరణ్ రెడ్డి, గణేష్లను ఆలయ అధికారులు, పోలీసు సిబ్బంది, భక్తులు అభినందించారు.

# కర్ణాటకలో బైక్ ట్యాక్సీ సేవలపై నిషేధాన్ని ఎత్తివేత

**-తాజాగా కర్ణాటక హైకోర్ట్ ఆదేశాలు జారి**

బెంగళూరు జనవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: గతేడాది జూన్‌లో కర్ణాటకలో బైక్ ట్యాక్సీలపై నిషేధం విధించిన విషయం తెలిసిందే. అయితే సింగిల్ బెంచ్ ఇచ్చిన ఈ తీర్పును తాజాగా కర్ణాటక హైకోర్టు పక్కన పెట్టింది. కర్ణాటకలో బైక్ ట్యాక్సీ సేవలపై నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇందుకగానూ పలు నిబంధనలు కూడా అమలు చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు చేసింది. కొత్త నిబంధనల ప్రకారం.. బైక్ ట్యాక్సీలను ఇకపై వాణిజ్య వాహనాలుగా పరిగణిస్తారు. బైక్ ట్యాక్సీలు ఉపయోగించేందుకు వాహన యజమానులు ముందుగా లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలి.

# జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా బేటి బచావో-బేటి పడావో ఎంపార్మెంట్ కిట్ల పంపిణీ.



సంగారెడ్డి, జనవరి 23(నేటి నిజం ప్రతినిధి) జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు జిల్లా మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావో?బేటి పడావో కార్యక్రమంలో భాగంగా స్వధార్ హోమ్ / శక్తి సదన్‌లో ఆశ్రయం పొందుతున్న మహిళలు, యువతులకు 20 వస్తువులతో కూడిన ఎంపార్మెంట్ కిట్లను జిల్లా కలెక్టర్ పి. ప్రవీణ్య పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, బాలికలు మరియు మహిళలు విద్య, ఉద్యోగం, క్రీడలు, వ్యాపారం తదితర అన్ని రంగాలలో ముందంజలో నిలుస్తున్నారని తెలిపారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ తమ హక్కులను తెలుసుకొని, స్వావలంబన సాధించాలన్నారు.

అలాగే స్వధార్ హోమ్ / శక్తి సదన్‌లలో ఆశ్రయం పొందుతున్న మహిళల కు, యువతులకు ఈ ఎంపార్మెంట్ కిట్లు ఉపయోగపడతాయని తెలిపారు. మహిళలు యువతులు స్వతంత్రంగా జీవించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని, సమాజంలో గౌరవప్రదమైన స్థానం సాధించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె. లలిత కుమారి, జిల్లా సమన్వయకర్త పల్లవి, డీసీపీఓ రత్నం, సఖి సి ఏ కల్పన, శక్తి సదన్ ఇన్‌చార్జి సుజాత, అధికారులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


# ఫోన్ ట్యాపింగ్ నేరం కాదు.. ఇది చట్టబద్ధమే: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



హైదరాబాద్ జనవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తెలంగాణను దేశంలో నెంబర్ వన్ గా తీర్చిదిద్దాలని మాజీ సిఎం కెసిఆర్ కృషి చేశారని బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. అలవికాని హామీలు ఇచ్చి సిఎం రేవంత్ రెడ్డి ప్రజలను మోసం చేశారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మాజీ మంత్రి హరీష్ రావు, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఎమ్మెల్సీలపై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. కేసులు పెడుతున్నా.. తెలంగాణ ప్రజల కోసమే బిఆర్ఎస్ నేతలు పోరాటం చేస్తున్నారని తెలియజేశారు. రెండేళ్లుగా ఫోన్ ట్యాపింగ్ పేరుతో కేసులు పెడుతున్నారని, రేవంత్ రెడ్డి అటెన్షన్ డైవర్షన్ చేస్తున్నారని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కెటిఆర్ కు సంబంధం లేదని, ఈ కేసుతో సంబంధం లేదని తమ పార్టీ నేతలను పిలిచి విచారణ చేయడాన్ని బిఆర్ఎస్ ఖండిస్తోందని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ నేరం కాదు.. ఇది చట్టబద్ధమేనని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. దేశ భద్రత కోసం, ప్రజల రక్షణ కోసం ఫోన్ ట్యాపింగ్ చేస్తారని, స్వాతంత్ర్యం రాకముందు నుంచి ఫోన్ ట్యాపింగ్ చట్టబద్ధంగా ఉందని అన్నారు. మాజీ అధికారిగా చెప్తున్నా.. ట్యాపింగ్ నేరం కాదని పార్లమెంట్ సాక్షిగా దివంగత ప్రధాని మంత్రి మన్మోహన్ సింగ్ చెప్పారని, ఫోన్ ట్యాపింగ్ అనేది దేశరక్షణ కోసం పోలీసులు గోప్యంగా చేసే కారక్రమం అని.. అన్నారు. స్వాతంత్ర్యం రాకముందే నుంచి ట్యాపింగ్ చట్టబద్ధంగా ఉందని.. చట్టబద్ధంగా జరుగుతున్న ట్యాపింగ్ వ్యవహారాన్ని రేవంత్ రెడ్డి బజారున పడేశారని ధ్వజమెత్తారు. ఎలా సమాచారం సేకరించారో అధికారులు ప్రధానికి, సిఎంకు, నేతలకు చెప్పరని, ట్యాపింగ్ అనేది పోలీసుల అంతర్గత వ్యవహారమని అన్నారు. అందులో భాగంగానే మొన్న హరీష్ రావును, ఇవాళ కెటిఆర్ ను వేధిస్తున్నారని, ట్యాపింగ్ తప్పు కాదని ఎన్నో సందర్భాల్లో రేవంత్ రెడ్డే చెప్పారని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఏం చేయమంటే అది అధికారులు చేస్తున్నారని, రాజకీయ వికృత క్రీడకు, ప్రతిపక్షాలపై ప్రతీకారం తీర్చుకునేందుకు ట్యాపింగ్ వ్యవహారాన్ని వాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ వ్యక్తిత్వాన్ని హననం చేసినా.. రేవంత్ సర్కార్ దోపిడీని బయటపెడుతునే ఉంటామని సూచించారు. దేశ రక్షణ గురించి రేవంత్ రెడ్డికి ఏమైనా బాధ్యత ఉందా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి రాజకీయ క్రీడల్లో భాగస్వాములైన అధికారులను మాత్రం వదిలేది లేదని హెచ్చరించారు. పోలీసులతో సంబంధం లేని శాఖలకు మంత్రులుగా పనిచేసిన కెటిఆర్, హరీష్ రావుకు ట్యాపింగ్ తో సంబంధం ఏంటీ అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.

# స్కంద జోలాలి లాలిపాటల బృందానికి సత్కారం..

**-మోపిదేవి ఆలయ అధికారులు, నిర్వాహకులు**
**-మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరుణికి స్కంద జోలాలి పాటతో పవళింపు సేవ**



హైదరాబాద్, జనవరి 23:అంతరించి పోతున్న లాలిపాటల సంప్రదాయానికి తిరిగి ప్రాణం పోసే సంకల్పంతో శివమస్తు క్రియేషన్స్ పతాకంపై, లక్ష్మణ్ కాపర్తి నిర్మాణంలో పలు లాలిపాటలను రూపొందించారు. ఈ విశిష్ట సంగీత ప్రయాణంలో ప్రముఖ గాయనీమణులు చిత్ర, ఎస్పీ శైలజ, మాళవిక, అంజనా సౌమ్య, రమ్య బెహర, దర్బా సిస్టర్స్ తదితరులు పాల్గొని సంగీత దర్శకుడు కార్తీక్ కొడకండ్ల సంగీత సారథ్యంలో పలు లాలి పాటలకు ప్రాణం పోశారు.

ఈ లాలి గీతాలకు ప్రముఖ రచయితలు నందిని సిద్ధారెడ్డి (సందమామయ్యలో పాటకు), మల్లావజ్జల కృష్ణవేణి (మిగతా ఐదు పాటలకు) సాహిత్యాన్ని అందించారు. సంప్రదాయ శ్రావ్యతతో పాటు ఆధునిక సౌందర్యాన్ని సమన్వయపరిచిన ఈ పాటలకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించడంతో ప్రతి పాటకు కొన్ని లక్షల వీక్షణలు రావడం విశేషంగా నిలిచింది.

ఇవన్నీ ఒక ఎత్తయితే గతంలో ఎప్పుడూ లేని విధంగా సినిమా పాటలకు దీటుగా ప్రజల మన్ననలు పొందిన స్కంద జోలాలి పాట మరింత ఉన్నతమైన గుర్తింపును సొంతం చేసుకుంది. ఈ పాటను ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మోపిదేవి శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో పవళింపు సేవకోసం ఎంపిక చేయడం విశేష గౌరవంగా నిర్వాహకులు పేర్కొన్నారు.

ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సాహితివేత్త కృష్ణవేణి మల్లావజ్జలతో పాటు లాలి పాటల బృందాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులు, అధికారులు మోపిదేవి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు. స్వామి వారి అనుగ్రహంతో ఈ లాలి గీతం ఇకపై నిత్యం స్వామి వారి సన్నిధిలో పవళింపు పాటగా ఆలపించబడటం తమ అందరి పూర్వజన్మ సుకృతమని శివమస్తు క్రియేషన్స్ నిర్వాహకులు భావోద్వేగంతో తెలిపారు.

స్కంద జోలాలీ పాట లక్ష్మణ్ కాపర్తి నిర్మాణ సారథ్యంలో రూపొందించగా.. కార్తీక్ కొడకండ్ల సంగీత దర్శకత్వం, కృష్ణవేణి మల్లావజ్జల సాహిత్యం అందించగా? ప్రముఖ గాయని రమ్య బెహరా ఆలపించారు.

# కెటిఆర్‌ను ఫోన్ ట్యాప్ చేసినందుకు పిలిచారా? లేక కెటిఆర్ ఫోన్ ట్యాప్ అయినందుకు పిలిచారా?

## – ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేంద్రమంత్రి బండి సంజయ్



కరీంనగర్ జనవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను ఫోన్ ట్యాప్ చేసినందుకు పిలిచారా? లేక కెటిఆర్ ఫోన్ ట్యాప్ అయినందుకు పిలిచారా? అని ప్రభుత్వాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. కరీంనగర్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసు సిరిసిల్ల కేంద్రంగా సాగిందని, ఫోన్ ట్యాపింగ్ ద్వారా వేల కోట్ల రూపాయల దందా సాగిందని ఆరోపణలు చేశారు. సినిమా హీరోయిన్ల ఫోన్లు ట్యాప్ చేసి ఎలా లబ్ధిపొందారా తనకు తెలుసునన్నారు. అన్ని కేసుల్లో సిట్ విచారణలకు ముగింపు ఉంటుందని, ఫోన్ ట్యాపింగ్‌లో మాత్ర సీరియల్‌లా ముగింపు లేదని ఎద్దేవా చేశారు. సిట్ విచారణలో అధికారులకు ఎంత స్వేచ్ఛ ఇచ్చారనేది అనుమానంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వ తీరుతో సిట్ అధికారులు బాధపడుతున్నారని, అసలు కెటిఆర్ ఎందుకు పిలిచారు? అని బండి ప్రశ్నించారు. సిరిసిల్ల కేంద్రంగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం నడిచిందని, ఫోన్ ట్యాపింగ్ కీలక సూత్రధారి ప్రభాకర్‌రావుపై ఎప్పుడు చర్యలు తీసుకుంటున్నారని, విచారణలో సిట్ సాధించిందేంటి? అని అడిగారు. మాజీ సిఎం కెసిఆర్ కూతురే తన ఫోన్ ట్యాప్ అయిందని చెప్పారని, ట్యాపింగ్‌కి భయపడి ఓ ఏడాది పాటు హరీష్ ఫోన్ ఉపయోగించలేదన్నారు. కెసిఆర్ హయాంలో బిచ్చగాళ్లు కూడా వాట్సాప్ కాల్ మాట్లాడాల్సిన పరిస్థితి ఉండేదని, తనని కూడా విచారించి వాంగ్మూలం తీసుకున్నారని, కానీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరవుతున్నారు. రెండో రోజుల క్రితం హరీష్ రావును సిట్ అధికారులు విచారించిన విషయం విధితమే.

# జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పోలీసుల ప్రతిజ్ఞ



అమరావతి, జనవరి 23:జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది ఓటర్ల ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో ఈ రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ మాట్లాడుతూ, ఓటరే ప్రజాస్వామ్యానికి ప్రధాన శక్తి అని, దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఓటేనని తెలిపారు.

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ప్రతి ఎన్నికలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపు నిచ్చారు. ఓటు వినియోగం ప్రతి పౌరుని బాధ్యత అని, మంచి సమాజ నిర్మాణానికి ఓటే కీలకమని అన్నారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బందిచే జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రతిజ్ఞ చేయించారు.

"భారతదేశ పౌరుడినైన నేను ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో మన దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలను స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ద్వారా నిలబెడతానని, మతం, జాతి, ప్రాంతం, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు లోనుకాకుండా ప్రతి ఎన్నికలో నిర్భయంగా ఓటు వేస్తానని ఇందుమూలంగా ప్రతిజ్ఞ చేస్తున్నాను" అని ప్రతిజ్ఞలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు నారాయణ, జావేద్, ఆర్ఎస్ఐలు, సివిల్, ఎఆర్ విభాగాల సిబ్బంది, జిల్లా పోలీసు కార్యాలయ మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మరో 208 కర్బనోద్గార పరిశ్రమలకు హరితగృహ వాయు ఉద్గార తీవ్రత పరిమితులను నిర్దేశించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, జనవరి 23:కార్బన్ క్రెడిట్ ట్రేడింగ్ స్కీమ్ (సీసీటీఎస్) కింద.. కర్బనోద్గారాలను అధికంగా వెలువరిస్తున్న పరిశ్రమలకు హరితగృహ వాయు ఉద్గార తీవ్రత (జీఈఐ) పరిమితులను భారత ప్రభుత్వం నిర్దేశించింది. 2026 జనవరి 13న విడుదల చేసిన ఈ నోటిఫికేషన్ ద్వారా.. పెట్రోలియం రిఫైనరీలు, పెట్రోకెమికల్లు, టెక్స్‌టైల్స్, సెకండరీ అల్యూమినియం రంగాలను భారత కార్బన్ మార్కెట్ (ఐసీఎం) నిబంధనల పరిధిలోకి తెచ్చారు. ఈ రంగాలకు సంబంధించి, మొత్తం 208 కాలుష్య కారక సంస్థలు.. ఇకపై నిర్దేశించిన ఉద్గార తీవ్రత తగ్గింపు లక్ష్యాలను తప్పనిసరిగా చేరుకోవాల్సి ఉంటుంది. దీంతో దేశంలో అత్యంత ఉద్గార తీవ్రత కలిగిన పరిశ్రమలకు చెందిన 490 కాలుష్య కారక సంస్థలు ఇప్పుడు భారత కార్బన్ మార్కెట్ నిబంధనల పరిధిలోకి వచ్చాయి. ప్రభుత్వం మొదట 2025 అక్టోబరులో అల్యూమినియం, సిమెంటు, క్లోర్– ఆల్కలీ, పల్ప్ – పేపర్ రంగాలకు చెందిన 282 కాలుష్య కారక సంస్థలకు ఈ ఉద్గార లక్ష్యాలను నిర్దేశించింది. 2023లో ప్రభుత్వం ప్రకటించిన సీసీటీఎస్.. భారత కార్బన్ మార్కెట్ పనితీరుకు విధివిధానాలను అందించింది. కార్బన్ క్రెడిట్ సర్టిఫికేట్ వర్తక యంత్రాంగం ద్వారా, ఉద్గారాలకు ధరలను నిర్ణయించి.. వివిధ రంగాల నుంచి వెలువడే హరిత గృహ వాయు ఉద్గారాలను తగ్గించడం లేదా నివారించడం సీసీటీఎస్ లక్ష్యం.




కళానిలయం సాంస్కృతిక సంఘ సేవా సంస్థ Regd.: 6284

శ్రీ త్యాగరాయ గానసభ (ప్రపంచ రికార్డులు పొందిన ఆడిటోరియం)

యువ విద్యార్థి నాయకుడు, తెలంగాణ అభిమాని

ఫణి భార్గవ్ యాదిలో...

ప్రతిభా పురస్కారం

దీప్తి వాజ్‌పేయి గారు డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్, టి.వి.9

శ్రీ ప్రవీణ్ కలవల గారు క్రైమ్ బ్యూరో ఛీఫ్, ఎ.బి.ఎన్. ఆంధ్ర జ్యోతి

ఆర్థిక సహకారం

కుమారి యం. రాజేశ్వరి బి.కాం. విద్యార్థిని

కుమారి పి. రక్షిత బి.కాం. విద్యార్థిని

సాయిబాబ సామాజిక కార్యకర్త

జీవిత సాఫల్య సత్కారం : శ్రీ అన్నె అచ్యుతరామయ్య గారు (100 సం॥) సీనియర్ నాయకులు (సి.పి.యం.)

ముఖ్యఅతిథి :

డా॥ కె.వి. రమణాచారి గారు IAS (Retd.) తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారులు

ఆత్మీయ అతిథి :

డా॥ ఏనుగు నరసింహారెడ్డి గారు సంచాలకులు భాషా సాంస్కృతిక శాఖ

సభాప్రారంభకులు :

శ్రీ కళా వి.యస్. జనార్ధన్ మూర్తి గారు అధ్యక్షులు, శ్రీ త్యాగరాయగానసభ

సభాధ్యక్షులు :

డా॥ యం.కె. రాము గారు పూర్వ సంచాలకులు, జవహర్ బాలభవన్, రచయిత

గౌరవ అతిథి :

శ్రీ బైస దేవదాసు గారు సంపాదకులు, నేటినిజం దినపత్రిక

శ్రీమతి ప్రవల్లిక నృత్య గురువు, శిష్య బృందంచే నృత్య కార్యక్రమాలు

శ్రీమతి సుష్మా ఉదయ్‌మహంతి నృత్య గురువు, శిష్య బృందంచే నృత్య కార్యక్రమాలు

శ్రీ శ్యామ్ లలితగీతాల గానం

27-01-2026 సా॥ 5.00 గం॥లకు, వేదిక : కళాసుబ్బారావు కళావేదిక, శ్రీ త్యాగరాయ గానసభ, చిక్కడపల్లి.

శ్రీమతి కళాశారద దీక్షితులు, ప్రధాన కార్యదర్శి త్యాగరాయ గానసభ

ఎ.సురేందర్, స్థాపక కార్యదర్శి 9550512032

శ్రీమతి ఎ. పుష్పలత అధ్యక్షులు


# 25న మల్కాజిగిరిలో స్టార్ మా సీరియల్స్ తారల సందడి!

హైదరాబాద్ జనవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );స్టార్ మా 'పొదరిల్లు' జంట గ్రాండ్ వెడ్డింగ్ రిసెప్షన్ హైదరాబాద్లో కనీవిని ఎరుగని టెలివిజన్ మహోత్సవం జనవరి 25 ఆదివారం సాయంత్రం 6 గంటల నుండి హైదరాబాద్ లో మల్కాజిగిరిలో శ్రీ లక్ష్మీ సాయి గార్డెన్స్ ఫంక్షన్ హాల్, అనుటెక్స్ చౌరస్తా లో జరగనుంది. ఈ సందర్భంగా ఒకే వేదికపై తొలిసారి స్టార్ మా సీరియల్స్ తారల సందడి చేయనున్నారు.

స్టార్ మా ఛానల్లో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న ప్రముఖ సీరియల్ 'పొదరిల్లు' హీరో? హీరోయిన్ వివాహ సందర్భంగా నిర్వహిస్తున్న గ్రాండ్ వెడ్డింగ్ రిసెప్షన్కు హైదరాబాద్ నగర ప్రజలను ఆహ్వానిస్తున్నారు. ఈ శుభసందర్భాన్ని మరింత ప్రత్యేకంగా మార్చేందుకు, స్టార్ మా లో ప్రసారమవుతున్న అన్ని ప్రముఖ సీరియల్స్కు చెందిన నటీనటులు ఒకే వేదికపై తొలిసారి సందడి చేయనున్నారు.

తమ అభిమాన హీరో? హీరోయిన్ను ఆశీర్వదించడానికి, శుభాకాంక్షలు తెలపడానికి స్టార్ మా కుటుంబం మొత్తం ఈ వేడుకకు హాజరుకానుంది

.ఇది కేవలం ఒక వివాహ వేడుక మాత్రమే కాదు..స్టార్ మా ప్రేక్షకులకు ఒక అరుదైన పండుగ!ఒకే చోట, ఒకే వేదికపై మీకు ఇష్టమైన అన్ని సీరియల్స్ తారలను ప్రత్యక్షంగా చూసే అవకాశం ఇదే తొలిసారి

.ఈ గ్రాండ్ వెడ్డింగ్ రిసెప్షన్లో అభిమానులతో కలిసి సెలబ్రేట్ చేసుకోవాలని 'పొదరిల్లు' జంట ప్రత్యేకంగా హైదరాబాద్ ప్రజలను ఆహ్వానిస్తోంది

.స్టార్ మా కుటుంబం మొత్తం ఒక్కటయ్యే ఈ మహా సంబరాన్ని మిస్ కాకండి!..మీ అభిమాన తారలతో కలిసి ఈ ఆనంద క్షణాలకు మీరు కూడా సాక్షులవ్వండి!

# పేద మహిళ అంత్యక్రియలకు వెస్సో సహాయం

హైదరాబాద్ జనవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రామోజు సత్యవతి(51), గృహిణి, రాజీవ్ శర్మ నగర్, విజయవాడ నివాసి, జనవరి 15న మృతి చెందారు. తల్లి అంత్యక్రియల ఖర్చులు భరించే స్థితిలో లేక వెస్సో ను సహాయం కోసం ఆశ్రయించాడు. వెస్సో ట్రస్టీలు స్పందించి, తల్లి అంత్యక్రియలు నిర్వహించేందుకు సతీష్ కు పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సత్యవతి తీవ్రమైన మధుమేహంతో పాటు గ్యాంగ్రిన్ వ్యాధితో బాధపడుతూ ఉండగా, ఇటీవలే ఆమె రెండు కాళ్లు తొలగించాల్సి వచ్చింది. ఆమెకు మరింత చికిత్స కోసం సహాయం పొందేందుకు వడ్రంగి వృత్తిలో ఉన్న ఆమె అవివాహిత కుమారుడు సతీష్ (28) వెస్సో ట్రస్ట్ ను సంప్రదించి దరఖాస్తు సమర్పించే ప్రక్రియలో ఉండగానే ఆమె మరణించారు.సతీష్ తండ్రి తాతారావు (55 పైబడి), వృత్తిరీత్యా కార్పెంటర్, రెండు సంవత్సరాల క్రితమే మృతి చెందారు. ఉపాధి నిమిత్తం ఆయన చాలా సంవత్సరాల క్రితమే తుని నుంచి విజయవాడకు వలస వచ్చారు. సతీష్‌కు లావణ్య(22) అనే ఓ అవివాహిత సోదరి కూడా ఉంది, ఆమె హైస్కూల్ చదువు మధ్యలోనే మానివేసింది.తల్లి చికిత్స కోసం తన పొదుపు మొత్తాన్ని ఖర్చు చేసిన సతీష్, గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న తల్లిని చూసుకునేందుకు పనికి కూడా వెళ్లలేకపోవడంతో, ఈ సందర్భంగా వెస్సో ట్రస్ట్ అధ్యక్షులు బంగారు తాతారావు మాట్లాడుతూ అంత్యక్రియలు వంటి పుణ్యకార్యానికి మద్దతునిస్తున్న గౌరవదాతలు అందరకూ పేరుపేరునా ధన్యవాదములు తెలిపారు.

# కెసిఆర్ కుటుంబం తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బతీస్తోంది: అద్దంకి

హైదరాబాద్ జనవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తెలంగాణను దోచుకున్న దొంగలు.. బిఆర్ఎస్ నేతలు అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నప్పుడు మాజీ సిఎం కెసిఆర్, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలే కవిత దోచుకున్నారని, ఇప్పుడు కెసిఆర్, కెటిఆర్, హరీష్ లు చెలరేగిపోతున్నారని ధ్వజమెత్తారు. మీ మీద వస్తున్న ఆరోపణలు నాటి హోం మంత్రిపై ఎందుకు రావడం లేదు అని ప్రశ్నించారు. ఆనాడు మంత్రివర్గాన్ని ఒక డమ్మీ కేబినెట్‌గా నడిపించారని, సిఎం రేవంత్ రెడ్డి కేబినెట్ పై అవాకులు.. చెవాకులు మాట్లాడితే ఊరుకోమని అద్దంకి హెచ్చరించారు. తాము రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామని అన్నారు. కెసిఆర్ కుటుంబం తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. కక్ష సాధించాలంటే ప్రభుత్వానికి రెండేళ్లు ఆగాల్సిన పనిలేదని అద్దంకి దయాకర్ పేర్కొన్నారు.

# దేశవ్యాప్తంగా 40 ప్రాంతాల్లో, ఏడు ఖండాల్లోని ఒక్కో దేశంలో భారీ స్థాయిలో 25వ భారత్ రంగ్ మహోత్సవ్ 2026 వేడుకలు

న్యూఢిల్లీ, జనవరి 23:ప్రపంచంలోనే అతిపెద్ద అంతర్జాతీయ నాటకోత్సవమైన 25వ భారత్ రంగ మహోత్సవ్ (బీఆర్ఎమ్) 2026 జనవరి 27 నుంచి ఫిబ్రవరి 20 వరకు జాతీయ నాటక పాఠశాల (ఎన్ఎస్ డీ) నిర్వహించనుంది. ఇది ఇప్పటి వరకు జరిగిన అన్ని ఉత్సవాల కంటే అత్యంత విస్తృతమైన, సమగ్ర కార్యక్రమంగా నిలవనుంది.

బీఆర్ఎమ్ 2026ను దేశవ్యాప్తంగా 40 ప్రాంతాల్లో నిర్వహించడంతో పాటు, ప్రపంచంలోని ఏడు ఖండాల్లో ఒక్కో దేశం నుంచి కనీసం ఒక నాటక ప్రదర్శనలను ప్రదర్శించడం కీలకం. ఈ ఉత్సవం ప్రపంచ వ్యాప్తిని, సాంస్కృతిక ప్రాధాన్యతను మరింత బలోపేతం చేస్తుంది.

ఈ ఉత్సవంలో మొత్తం 277 భారతీయ నాటకాలను ప్రదర్శించనున్నారు. వీటిలో 136 ఎంపిక చేసిన నాటకాలు, ఆహ్వానిత ప్రదర్శనలు ఉన్నాయి. అలాగే 12 అంతర్జాతీయ నాటక ప్రదర్శనలు కూడా నిర్వహించనున్నారు. ఈ ప్రదర్శనలు 228 భారతీయ, విదేశీ భాషలు, మాండలికాల్లో ఉండనున్నాయి. దీని వల్ల భాషా వైవిధ్య పరంగా భారత్ రంగ మహోత్సవ్ ప్రపంచంలోనే అతిపెద్ద నాటకోత్సవంగా నిలుపుతుంది.

ఎంపిక చేసిన నాటకాలు 817 జాతీయ, 34 అంతర్జాతీయ దరఖాస్తులపై నిర్వహించిన కఠినమైన పరిశీలన ప్రక్రియ ద్వారా ఎంపిక చేశారు. వీటితో పాటు వివిధ కేంద్రాల్లో 19 విశ్వవిద్యాలయ ప్రదర్శనలు, 14 స్థానిక నాటక ప్రదర్శనలు కూడా ఈ ఉత్సవంలో భాగంగా ఉండనున్నాయి.

ఈ సందర్భంగా జాతీయ నాటక పాఠశాల (ఎన్ఎస్ డీ) ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ భారత్ గుప్తా మాట్లాడుతూ.. "భారత్ రంగ మహోత్సవ్ 2026, కేవలం ఉద్దేశంలోనే కాకుండా దాని విస్తృత స్థాయిలో కూడా నాటక రంగం ప్రజాస్వామ్యీకరణ, సార్వత్రికీకరణకు నిదర్శనంగా నిలుస్తోంది. విభిన్న భాషలు, కళారూపాలు, వివిధ వర్గాలు, వయసుల వారి నుంచి వచ్చిన నాటక వ్యక్తీకరణలను ఇందులో సమ్మిళితం చేయడం ద్వారా భారతీయ సృజనాత్మక వారసత్వాన్ని ఈ ఉత్సవం ప్రతిబింబిస్తోంది." అని తెలిపారు.




ఈ ఏడాది ఉత్సవంలో మైథిలి, భోజ్‌పురి, తుళు, ఉర్దూ, సంస్కృతం,తాయ్ ఖమ్తి, నిషి వంటి భాషలతో పాటు దాదాపు అన్ని ప్రధాన దేశీయ భాషలు, పలు గిరిజన, అంతరించిపోతున్న భాషల్లో నాటక ప్రదర్శనలు జరగడం ద్వారా భాష, సాంస్కృతిక పరిధి గణనీయంగా విస్తరించింది.

ఈ ఉత్సవంలో తొలిసారిగా లడఖ్, అండమాన్ అండ్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, దామన్ అండ్ దయ్యూ, ఐజ్వాల్ (మిజోరం), తురా (మేఘాలయ), నాగావ్ (అస్సాం), మండి (హిమాచల్ ప్రదేశ్), రోహ్తక్ (హర్యానా) వంటి ప్రాంతాలను కొత్త కేంద్రాలుగా చేర్చారు.

ఉత్సవ స్ఫూర్తిని వివరిస్తూ.. జాతీయ నాటక పాఠశాల డైరెక్టర్ శ్రీ చిత్తరంజన్ త్రిపాఠి ఇలా అన్నారు. "25వ భారత్ రంగ మహోత్సవ్ ప్రజల కోసం, ప్రజల చేత, ప్రజల ద్వారా నిర్వహించే నాటక రంగ మహాకుంభం. ఇది అందరినీ కలుపుకుపోయే, వర్గభేదాలు లేని అంతర్జాతీయ నాటక ఉత్సవం. ఇక్కడ విభిన్న నాటక రూపాల ద్వారా భాషలు, ప్రాంతాలు, కళా సౌందర్యాలు, సిద్ధాంతాలు ఏకమవుతాయి.

ఈ ఉత్సవం దేశంలోని అత్యంత మారుమూల ప్రాంతాల వరకు చేరుకోవడం గర్వకారణం. ఇలాంటి అవకాశాలు చాలా పరిమితంగా ఉన్న ప్రాంతాల్లో కూడా ప్రజలకు నాటక అనుభవాన్ని చేరువ చేస్తుంది. గొప్ప మౌఖిక, లిఖిత సంప్రదాయాలు కలిగిన తగిన గుర్తింపు లేని భాషలకు కూడా బీఆర్ఎమ్ ఒక వేదికను అందిస్తోంది" అని తెలిపారు.

బీఆర్ఎమ్ 2026లో ఆది రంగ్ మహోత్సవ్ విభిన్నమైన, అనుబంధ నాటక ఉత్సవాల సమాహారాన్ని ప్రదర్శిస్తుంది. వాటిలో (గిరిజన నాటకం, నృత్యం, హస్తకళలు), జష్నే బచ్‌పన్ (బాలల నాటకం), బాల్ సంగమ్ (పిల్లల జానపద నృత్య నాటకాలు), పూర్వోత్తర్ నాట్య సమారోహ్ (ఈశాన్య రాష్ట్రాల నాటక ప్రదర్శనలు), తోలుబొమ్మలాట ఉత్సవం, నృత్య రూపక ఉత్సవం, శాస్త్రీయ సంస్కృత నాటకోత్సవం, మైక్రో డ్రామా ఫెస్టివల్ వంటి ప్రదర్శనలు ఉండనున్నాయి.

తొలిసారిగా ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీలు, సెక్స్ వర్కర్లు, సీనియర్ సిటిజన్లు ఇతర వెనుకబడిన వర్గావారు రూపొందించిన నాటక ప్రదర్శనలకు కూడా ఈ ఉత్సవంలో చోటు కల్పించనున్నారు.

ఈ ఉత్సవంలో భగవాన్ బిర్సా ముండా, లోక్ మాతా అహల్యా బాయి, డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వంటి విశిష్ట వ్యక్తులను స్మరించుకోవడంతో పాటు, నాటకరంగ దిగ్గజాలైన రతన్ థియామ్, దయా ప్రకాష్ సిన్హా, బన్సీ కౌల్, ఆలోక్ ఛటర్జీలకు నివాళులర్పించనున్నారు. ఎన్ఎస్‌డీ ఢిల్లీ క్యాంపస్‌లో ఇబ్రహీం అల్కాజీని సత్కరించే ఓ ప్రత్యేక సదస్సును నిర్వహిస్తారు. క్యాన్సర్ బాధితుడు, ఎన్ఎస్‌డీ పూర్వ విద్యార్థి రాసి, ప్రదర్శించే ఒక ప్రత్యేక నాటక ప్రదర్శన కూడా ఇక్కడ నిర్వహించనున్నారు.

జానపద కళా ప్రదర్శనలు, వీధి నాటకాలు, సదస్సులు, మాస్టర్ క్లాస్‌లు, వర్క్‌షాప్‌లు ఈ ఉత్సవంలో అంతర్భాగంగా ఉంటాయి. ఎన్ఎస్‌డీ విద్యార్థుల సంఘం నేతృత్వంలోని అద్వితీయ విభాగం ద్వారా ఇంటరాక్టివ్ సదస్సులు, వీధి నాటక ప్రదర్శనలు నిర్వహించనున్నారు.

ఉత్సవంలో థియేటర్ బజార్ అనే వేదిక ద్వారా కొత్తగా రాసిన నాటకాలను ప్రోత్సహిస్తారు. ఎంపిక చేసిన రచనలకు అవార్డులు అందించి వాటిని ప్రచురిస్తారు.. "శ్రుతి" కార్యక్రమంలో 17 పుస్తకాలు ఆవిష్కరించనున్నారు. ముఖ్యంగా మహిళా దర్శకులు తెరకెక్కించిన 33 నాటకాలను ప్రదర్శించనున్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, సామాజిక సంస్కర్తలు, ప్రముఖ నాటక కళాకారులను సత్కరించే ప్రత్యేక ప్రదర్శనలు కూడా ఉండనున్నాయి.

దేశంలోని విభిన్న వంటకాల సంప్రదాయాలు, సాంప్రదాయ హస్తకళలను ప్రదర్శించే ప్రత్యేక కౌంటర్లు ఈ ఉత్సవానికి సాంస్కృతిక శోభను తీసుకురానున్నాయి.

మైథిలీ-భోజ్‌పురి అకాడమీ, హిందీ -కాడమీ, గర్వాలీ-కుమౌని?జౌన్సారీ అకాడమీ, ఉర్దూ అకాడమీ (ఢిల్లీ ప్రభుత్వం) వంటి ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక, విద్యా సంస్థల సహకారంతో భారత్ రంగ్ మహోత్సవ్ 2026 ను భారీ స్థాయిలో నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ సహకార సంస్థల్లో నేషనల్ పోలిష్ థియేటర్ అకాడమీ (వార్సా), నేషనల్ అకాడమీ ఆఫ్ థియేటర్ అండ్ ఫిల్మ్ ఆర్ట్స్ (మాడ్రిడ్), రష్యన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ –జీఐటీఐఎస్(మాస్కో) వంటి సంస్థలు ఉన్నాయి. వీటితో పాటు పలు భారతీయ రాష్ట్రాలు, సాంస్కృతిక సంస్థల మద్దతు కూడా ఉంది.

# టి-20 ప్రపంచకప్.. ఈడెన్ గార్డెన్స్‌కు ఐసిసి రేటింగ్..

కోల్‌కతా జనవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: టి–20 ప్రపంచకప్–2026 మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానుంది. ఈ సారి భారత్, శ్రీలంక వేదికగా ఈ మెగా టోర్నీ జరుగనుంది. ఇప్పటికే టోర్నమెంట్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అయితే గురువారం ఐసిసి, బిసిసిఐకి చెందిన ఉమ్మడి తనిఖీ బృందం కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ స్టేడియంను సందర్శించాయి. స్టేడియంలోని సౌకర్యాలు, పిచ్‌ను పరిశీలించి సంతృప్తికరం అనే రేటింగ్‌ను ఇచ్చాయి. ఈ విషయాన్ని క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్(క్యాబ్) వెల్లడించింది. మాజీ క్రికెటర్ కార్పొరేట్ బాక్స్‌లను పరిశీలించి సౌకర్యాలపై ఆనందం వ్యక్తం చేసింది. మెగా టోర్నీని విజయవంతంగా నిర్వహించేందుకు ఐసిసి ఆసక్తిగా ఎదురుచూస్తోంది" అని క్యాబ్ పేర్కొంది. టి–20 ప్రపంచకప్–2026లో భాగంగా ఈడెన్ గార్డెన్స్ వేదికగా గ్రూప్ స్టేజీలో మొత్తం ఐదు మ్యాచ్‌లు జరుగుతాయి. మూడు ప్రారంభ మ్యాచుల్లో.. ఒక టి–20 ఈ మైదానం వేదిగానే జరగనుంది. పాకిస్థాన్ మ్యాచులు శ్రీలంకలో జరగనున్న విషయం తెలిసిందే. ఆ జట్టు ఫలితాల ఆధారంగా.. సూపర్ 8, సెమీఫైనల్ మ్యాచులు సైతం ఈ మైదానంలోనే నిర్వహించే అవకాశం ఉంది.

# ఫోన్ ట్యాపింగ్ పై కెటిఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలి: టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్ జనవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఫోన్ ట్యాపింగ్ పై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలని, వ్యక్తిగత హననం చేస్తున్నారని కెటిఆర్ అనడం హాస్యాస్పదం టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయ కక్ష ఉంటే అధికారంలోకి రాగానే చర్యలుండేవని, ఫోన్ ట్యాపింగ్.. వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించినట్లేనని చెప్పారు.

ఆరోపణలు చేసి పారిపోతామంటే కుదరదని సూచించారు. అలీబాబా 420 దొంగల మాదిరి మాజీ సిఎం కెసిఆర్ కుటుంబం దోపిడి చేశారని మండిపడ్డారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను చెల్లెలుగా ఎప్పుడూ గౌరవిస్తానని, వాటాల పంపకాల్లో తేడా వల్లే కెసిఆర్ కుటుంబంలో గొడవలు అని తెలియజేశారు.

ఇప్పటికైనా కవిత నిజాలు మాట్లాడటాన్ని స్వాగతిస్తున్నానని, ఎఐసిసి ఇన్ చార్జ్ మార్పు ఉండదని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# దావోస్‌లో భారత్ పట్ల ప్రపంచ దృక్పథం అత్యంత సానుకూలంగా ఉంది: అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ, జనవరి 23: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వ్యక్తిగతంగా చేపట్టిన లోతైన నిర్మాణాత్మక సంస్కరణల ద్వారా భారత్ సంస్కరణల వేగం స్థిరంగా కొనసాగుతోందనీ... ఇవి ఆర్థిక వ్యవస్థలో అధిక వృద్ధి, సమర్థతలతో ప్రపంచంలోనే భారత్‌ను విశ్వసనీయ గమ్యస్థానంగా మార్చాయని కేంద్ర రైల్వేలు, కమ్యూనికేషన్లు, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికత శాఖల మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ ఈ రోజు వ్యాఖ్యానించారు.

దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక ఫోరం వార్షిక సమావేశం సందర్భంగా శ్రీ వైష్ణవ్ మాట్లాడుతూ... కార్మిక చట్టాల సంస్కరణలు, వస్తు సేవల పన్ను సరళీకరణ, ఇంధన రంగంలో సంస్కరణలు, అణు ఇంధన రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి వీలు కల్పించడం వంటి ఇటీవలి సంవత్సరాల్లో చేపట్టిన చరిత్రాత్మక సంస్కరణలు అన్ని రంగాల్లోనూ పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంపొందిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు.

ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాల్లో నిరంతర సంస్కరణల ప్రక్రియ కొనసాగుతోందని కేంద్ర మంత్రి తెలిపారు. దేశంలోని విధానపరమైన వాతావరణం పెట్టుబడిదారులను ఎంతగానో ప్రోత్సహిస్తోందనీ, తద్వారా వారు తమ పెట్టుబడులను మరింతగా విస్తరిస్తున్నారని ఆయన వివరించారు. ఐకియా తన పెట్టుబడిని రెట్టింపు చేయనున్నట్లు ప్రకటించడం, క్వాల్‌కామ్ భారత్‌లో తన ఉద్యోగుల సంఖ్యను గణనీయంగా పెంచడం వంటి పలు ఉదాహరణలను ఆయన ఉటంకించారు. వివిధ రంగాలకు చెందిన కంపెనీలు ప్రస్తుత కాలాన్ని భారత్‌లో పెట్టుబడి పెట్టడానికి సరైన సమయంగా భావిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

భారత స్థూల ఆర్థిక ప్రాథమికాంశాలను ప్రధానంగా ప్రస్తావించిన శ్రీ వైష్ణవ్... భారత్ ఈ రోజు ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ఉందన్నారు. రాబోయే ఐదేళ్లలో 6-8 శాతంతో స్థిరమైన వృద్ధిని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. మితమైన ద్రవ్యోల్బణం, అధిక వృద్ధిల కలయిక... గత దశాబ్ద కాలంలో ప్రధాన మంత్రి నాయకత్వంలో సాధించిన ఆర్థిక పరివర్తనను ప్రతిబింబిస్తోందని, ఇది ప్రపంచ దృష్టినీ ఆకర్షిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

ప్రస్తుతం ఉన్న ప్రపంచ అనిశ్చితులను ప్రస్తావిస్తూ... భౌగోళిక రాజకీయ, భౌగోళిక ఆర్థిక, భూసాంకేతిక అనిశ్చితుల మధ్య సమర్థతను పెంపొందించడానికి అంతర్గత సామర్థ్యాలను బలోపేతం చేయాల్సిన అవసరముందని కేంద్ర మంత్రి తెలిపారు. ప్రపంచ అనిశ్చితులను తట్టుకుని నిలబడగలిగేందుకు భారత ఆర్థిక వ్యవస్థ పునాదులను దృఢంగా ఉండేలా చూసుకోవడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని ఆయన పేర్కొన్నారు.

భారత్ తన సెమీకండక్టర్ వ్యవస్థను క్రమంగా విస్తరిస్తోందనీ, సమగ్రమైన కృత్రిమ మేధ స్టాక్‌నూ అభివృద్ధి చేస్తోందని, రక్షణ ఉత్పత్తిని వేగంగా పెంచుతోందని, భారతీయ ఐటీ సంస్థలు సాంప్రదాయ సాఫ్ట్‌వేర్ సేవల నుంచి ఏఐ- ఆధారిత పరిష్కారాలకు మారడానికి వీలు కల్పిస్తోందని శ్రీ వైష్ణవ్ వివరించారు. ఈ ప్రయత్నాలు భారత ఆర్థిక సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి సమష్టిగా దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.

దావోస్‌లో భారత్ పట్ల ప్రపంచ దృక్పథం అత్యంత సానుకూలంగా ఉందని, సుస్థిరమైన ఆర్థిక వృద్ధిని ప్రదర్శిస్తున్న విశ్వసనీయ దేశంగా భారత్ విస్తృత గుర్తింపును పొందిందని కేంద్ర మంత్రి తెలిపారు. వివిధ ప్యానెళ్లలో జరిగిన చర్చలు ఒక విస్తృత ఏకాభిప్రాయాన్ని ప్రతిబింబించాయన్నారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించడం ఇప్పుడు సాధ్యతకు సంబంధించిన విషయం కాదని... కేవలం సమయానికి సంబంధించిన విషయమేనని ఆయన అన్నారు.

భారత సమ్మిళిత వృద్ధి నమూనాను హైలైట్ చేస్తూ... 54 కోట్లకు పైగా జన్ ధన్ బ్యాంక్ ఖాతాలను తెరవడం, 80 కోట్లకు పైగా లబ్ధిదారులకు నిరంతర ప్రాతిపదికన ఆహార భద్రతను అందించడం వంటి కార్యక్రమాలు దేశ ఆర్థిక వృద్ధి మారుమూల ప్రాంతంలోని వారికీ చేరేందుకు దోహదపడ్డాయని శ్రీ వైష్ణవ్ వివరించారు. ఈ సమ్మిళిత వృద్ధి నమూనా పరిధి, ప్రభావాన్ని ప్రపంచమంతా గుర్తిస్తోందని, ప్రశంసిస్తోందనీ ఆయన తెలిపారు.

## సరస్వతీ మాత జయంతి వేడుకలు

చౌటుప్పల్, జనవరి 23: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని ట్రినిటీ విద్యా సంస్థలలో ఈ రోజు చదువుల తల్లి సరస్వతి అమ్మవారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత పంచమి ని పురస్కరించుకొని 286 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. చిన్నారులకు పలక, బలపం పంపిణీ చేశారు. ముందుగా అర్చకులు కిషోర్ శర్మ ఆధ్వర్యంలో గణాలకు అధిపతి అయినా గణపతి పూజ, మనల్ని రక్షిస్తున్న నవగ్రహాల పూజ, పుష్పాలతో నిర్వహించారు.

# కిడ్స్ కాన్వెంట్ హైస్కూల్లో ఘనంగా వసంత పంచమి వేడుకలు




రాజన్న సిరిసిల్ల, జనవరి 23: నేటినిజం (ప్రతినిధి): వసంత పంచమి శుభ దినం పురస్కరించుకొని వేములవాడ లోని కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్లో వసంత పంచమి వేడుకలు నిర్వహించారు ఈ సందర్భంగా చదువుల తల్లి సరస్వతి దేవికి పూజా కార్యక్రమం నిర్వహించారు అనంతరం నూతన విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు చదువుల తల్లిగా జ్ఞానం అందించే దేవిగా సరస్వతి దేవిని కొలుస్తారని ఈ శుభదినం నాడు అక్షరాభ్యాసం చేస్తే విద్యార్థులకు జ్ఞానం అందుతుందని నమ్మకమని ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం తెలియజేసినది అలాగే విద్యార్థులకు వసంత పంచమి గురించి ఈ పండగ విశిష్టత గురించి తెలియజేశారు అనంతరం విద్యార్థులు సరస్వతి మాత పూజా కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ కరస్పాండెంట్ నరాల దేవేందర్, ప్రిన్సిపాల్ దరక్షన్ వసూవియా, టీచర్స్,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## భారతదేశ కథా సంప్రదాయాలను, వేవ్స్ దార్శనికతను ప్రదర్శించనున్న సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ శకటం

న్యూఢిల్లీ, జనవరి 23:ఈ నెల 26 వ తేదీన ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో “భారత గాథ: శ్రుతి, కృతి, దృష్టి ఇతివృత్తంతో సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ ప్రదర్శించే శకటం ప్రాచీన మౌఖిక సంప్రదాయాల నుంచి ప్రపంచ స్థాయి కంటెంట్, మీడియా శక్తిగా ఎదిగిన భారతదేశ నాగరికతా ప్రయాణాన్ని కథన రూపంలో శక్తిమంతంగా ఆవిష్కరిస్తుంది. ఈ శకటం ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ, సాంస్కృతిక వారసత్వాన్ని సాంకేతిక నవోన్నతులతో సమన్వయంగా మేళవించిన అద్భుత దృశ్య రూపాన్ని అందిస్తుంది.

శ్రుతి అనేది భారతదేశ సమృద్ధమైన మౌఖిక సంప్రదాయ వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ భాగంలో, రావి చెట్టు నీడన గురుశిష్యులకు జ్ఞానాన్ని బోధిస్తున్న దృశ్యం ద్వారా శ్రుతి ఆవిష్కృతమవుతుంది. అదే సమయంలో, ఓంకారానికి సంబంధించిన బ్రహ్మాండ ధ్వని ప్రతిధ్వనిని, జ్ఞాన ఉద్భవాన్ని సూచించే ధ్వని తరంగాల రూపకాలు ఈ చిత్రణకు తోడ్పడుతూ, భారతీయ జ్ఞాన పరంపర మూలాలను ప్రతిఫలింపజేస్తాయి.

కృతి అనేది భారతీయ లిఖిత రూప వ్యక్తీకరణ పరిణామాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ భాగంలో భగవాన్ గణేశుడు మహాభారతాన్ని లిఖిస్తున్న దృశ్యం ద్వారా లిఖిత రూప కళలోని ప్రాముఖ్యతను చూపిస్తారు. ఇంకా ప్రాచీన పత్రికలు, సంగీతం, నాట్యం, నృత్యం వంటి ప్రదర్శన కళలు, ప్రారంభంలోని కమ్యూనికేషన్ సంప్రదాయాల ద్వారా భారతీయ జ్ఞాన సంపత్తి సాంస్కృతిక వారసత్వం ఎలా రూపుదిద్దుకున్నదో వివరిస్తారు.

‘దృష్టి’ విభాగం ముద్రణ (ప్రింట్), సినిమా, టెలివిజన్, డిజిటల్ వేదికల ద్వారా భారత మీడియా రంగం పరిణామాన్ని కళ్లకు కడుతుంది. పాతకాలపు కెమెరాలు, ఫిల్మ్ రీల్స్, ఉపగ్రహాలు, వార్తాపత్రికలు, బాక్సాఫీస్ చిహ్నాలు వంటి దృశ్యరూపాల ద్వారా భారత సాంస్కృతిక మూలాలను తీర్చిదిద్దిన తరతరాల చలనచిత్ర నిర్మాతలు, కళాకారులకు గౌరవవందనం సమర్పిస్తారు. ఈ శకటం కృత్రిమ మేధ, ఏవీజీసీ - ఎక్స్ ఆర్ (యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ ఎక్స్‌టెండెడ్ రియాలిటీ), వర్చువల్ ప్రొడక్షన్ సాంకేతికతల ద్వారా భవిష్యత్ అవసరాలకు సిద్ధంగా ఉన్న కథా సంప్రదాయాలను కూడా ప్రముఖంగా తెలియచేస్తుంది. ప్రేక్షకులు కథలో పూర్తిగా లీనమైపోయేలా చేసే సరికొత్త విధానంలోకి మారుతున్న ధోరణిని కూడా చూపిస్తుంది.

వివిధ రూపాల ప్రదర్శనకారులు తమ ప్రదర్శనలతో ఈ శకటానికి జీవం పోశారు. 2025లో జరిగిన ‘వేవ్స్’ సదస్సు చేకూర్చిన బలంతో గ్లోబల్ కంటెంట్ పరంగా భారత్ ను ప్రపంచ కేంద్రంగా నిలపాలనే తీర్చిదిద్దాలనే సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ లక్ష్యానికి అనుగుణంగా ఈ శకట ఇతివృత్తం రూపుదిద్దుకుంది. భారీ అంతర్జాతీయ భాగస్వామ్యం, గణనీయమైన వ్యాపార ఒప్పందాలతో జరిగిన వేవ్స్ సదస్సు సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ (ఆరెంజ్ ఎకానమీ) ఆవిర్భావానికి ఒక సంకేతంగా నిలిచింది. ఈ శకటం భారత పురాతన విజ్ఞానాన్ని, డిజిటల్ భవిష్యత్తును ఏకం చేస్తూ, అటు సాంస్కృతిక కాలక్రమానికి, ఇటు భవిష్యత్ దార్శనికతకు నిదర్శనంగా నిలుస్తుంది.

# కేరళ మోడల్ స్కూల్‌లో వసంత పంచమి వేడుకలు



రాజన్న సిరిసిల్ల, జనవరి 23: నేటినిజం (ప్రతినిధి): :కేరళ మోడల్ స్కూల్‌లో వసంత పంచమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల యజమాన్యం సరస్వతీ పూజను నిర్వహించి, కొత్తగా చేరిన పలువురు విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు.వసంత పంచమి శుభ సందర్భాన్ని పురస్కరించుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. చదువుల తల్లి సరస్వతీ దేవి ఆశీస్సులతో విద్యార్థులు విద్యా రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పాఠశాల ప్రతినిధులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సతీ మనోజ్ కుమార్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పిల్లల చదువుకు శుభారంభం, వసంత పంచమి అక్షరాభ్యాసం

## -ప్రధానోపాధ్యాయుడువిక్కుర్తి లక్ష్మీనారాయణ




రాజన్న సిరిసిల్ల, జనవరి 23: నేటినిజం (ప్రతినిధి): వసంత పంచమి సందర్భంగా వేములవాడలోని ప్రాథమిక పాఠశాల న్యూ అర్బన్ కాలనీలో అంగన్వాడి కేంద్రంలోని చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఏడాదిలో అత్యంత శుభదినాల్లో వసంత పంచమి ఒకటని, అందుకే మాఘమాస శుక్లపక్ష పంచమి తిథిన జరుపుకునే అక్షరాభ్యాస కార్యక్రమం చిన్నారుల జీవితంలో తొలి విద్యారంభానికి అత్యంత శుభకరంగా భావిస్తారని, ఈ శక్తివంతమైన రోజున విద్యకు, వాక్కుకు, కళలకు అధిష్టాన దేవత, జ్ఞాన స్వరూపిణి అయిన సరస్వతి అమ్మవారిని ప్రత్యేకంగా పూజిస్తారని, సకల విద్యాప్రదాయని జ్ఞాన స్వరూపిణి అయిన సరస్వతి అమ్మవారు మాఘ శుక్ల పంచమి నాడు ఆవిర్భవించిందని పురాణాలు చెబుతున్నాయని తెలిపారు. సరస్వతి అమ్మవారి ఆలయాల్లోనే కాకుండా నివాసాలు, విద్యాలయాల్లోనూ చదువుల తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని, వసంత పంచమి రోజున చేసే కార్యాలకు పంచాంగ దోషాలు ఉండవని శాస్త్రాలు చెబుతున్నాయని, పిల్లలు చదువులో రాణించేందుకు ఈరోజు అక్షరాభ్యాసం చేయిస్తారని, సంగీత, కళా శిక్షణ ప్రారంభం చేయడం వల్ల చిన్నారులకు ధ్యానం, బుద్ధి, వాక్చాతుర్యం లభిస్తాయని నమ్మకం అని, చాలా విద్యాలయాల్లో సరస్వతి పూజలు చేయడంతో పాటు తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించి పెన్నులు, పలకలు, పుస్తకాలు పంచి పెడతారని, ఈరోజు ఈ విధంగా చేస్తే అమ్మవారి అనుగ్రహం కలుగుతుందని వారి నమ్మకం అని, అన్ని శక్తుల్లో జ్ఞాన శక్తి మహోన్నతమైనదని అన్నారు. ప్రపంచాన్ని జయించే శక్తి జ్ఞానశక్తి ( చదువు , విజ్ఞానం) కి మాత్రమే ఉన్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, అంగన్వాడి ఉపాధ్యాయినులు లిక్కిడి మంజుల, పులి శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

# 5 లక్షల సర్క్యూట్ కిలోమీటర్లు దాటిన భారత విద్యుత్ సరఫరా వ్యవస్థ

న్యూఢిల్లీ, జనవరి 23:దేశ జాతీయ విద్యుత్ ప్రసార వ్యవస్థ కీలక మైలురాయిని అధిగమించింది. 220 కేవీ, అంతకన్నా ఎక్కువ సామర్థ్యం గల ప్రసార మార్గాల పొడవు 5 లక్షల సర్క్యూట్ కిలోమీటర్లను దాటగా.. ట్రాన్స్‌ఫార్మేషన్ సామర్థ్యం 1,407 జీవీఏకు చేరింది.

ప్రపంచంలో అతిపెద్ద సింక్రోనస్ జాతీయ గ్రిడ్ 2026 జనవరి 14న ఈ ఘనతను సాధించింది. రాజస్థాన్ పునరుత్పాదక ఇంధన జోన్ నుంచి విద్యుత్తును తరలించడం కోసం.. భద్లా-ఎఎ నుంచి సీకర్-ఎఎ సబ్‌స్టేషన్ వరకు నిర్మించిన 765 కేవీ సామర్థ్యం గల 628 సర్క్యూట్ కిలోమీటర్ల ప్రసార మార్గాన్ని ప్రారంభించడంతో ఇది సాధ్యమైంది. ఈ ప్రసార మార్గం ప్రారంభంతో.. భద్లా, రామగఢ్, ఫతేగఢ్ సౌర విద్యుత్ కాంప్లెక్సుల పునరుత్పాదక ఇంధన జోన్ నుంచి అదనంగా 1,100 మెగావాట్ల విద్యుత్తును తరలించే వీలు కలిగింది.

2014 ఏప్రిల్ నుంచి దేశ విద్యుత్ ప్రసార వ్యవస్థ 71.6% వృద్ధిని సాధించింది. ఈ కాలంలో 220 కేవీ, అంతకన్నా ఎక్కువ సామర్థ్యం గల 2.09 లక్షల సర్క్యూట్ కిలోమీటర్ల ప్రసార మార్గాలను కొత్తగా నిర్మించారు. అలాగే, ట్రాన్స్‌ఫార్మేషన్ సామర్థ్యం కూడా (220 కేవీ, అంతకన్నా ఎక్కువ సామర్థ్యం గలది) 876 జీవీఏ మేర పెరిగింది. ప్రస్తుతం 1,20,340 మెగావాట్లుగా ఉన్న అంతర ప్రాంతీయ విద్యుత్ బదిలీ సామర్థ్యం వల్ల దేశంలో వివిధ ప్రాంతాల మధ్య ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా సాధ్యమైంది. తద్వారా ‘ఒక దేశం - ఒకే గ్రిడ్ - ఒకే ఫ్రీక్వెన్సీ’ లక్ష్యం సాకారమైంది.ప్రస్తుతం పనిచేస్తున్న అంతర్రాష్ట్ర ప్రసార ప్రాజెక్టులతో దాదాపు 40,000 సర్క్యూట్ కిలోమీటర్ల ప్రసార మార్గాలు, 399 జీవీఏ ట్రాన్స్‌ఫార్మేషన్ సామర్థ్యం పెరగబోతోంది. వీటితోపాటు పనిచేస్తున్న రాష్ట్రాల అంతర్గత ప్రసార ప్రాజెక్టులతో మరో 27,500 సర్క్యూట్ కిలోమీటర్ల ప్రసార మార్గాలు, 134 జీవీఏ ట్రాన్స్‌ఫార్మేషన్ సామర్థ్యం పెరుగుతాయని అంచనా. ఇవి గ్రిడ్ విశ్వసనీయతను, విద్యుత్ తరలింపు సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుస్తాయి.

# షూటింగ్ బాల్ పోటీలకు కరీంనగర్ క్రీడాకారుల ఎంపిక

## - అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ మూఫాజిల్ అహ్మద్



కరీంనగర్, జనవరి 23:(నేటినిజం ప్రతినిధి) యునైటెడ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ వివరాలను అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ మూఫాజిల్ అహ్మద్ వెల్లడించారు.ఎంపికైన క్రీడాకారుల సబ్ జూనియర్ విభాగంలో గోపు మహారూవ్, సాత్విక్, సహన్, జూనియర్ విభాగంలో మొహమ్మద్ సాబిక్, సీనియర్ విభాగంలో మొహమ్మద్ అద్నాన్ ఎంపికయ్యారని పేర్కొన్నారు.ఈ క్రీడాకారులు ఫిబ్రవరి 7 , 8వ తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి నగరంలో నిర్వహించబడే 5వ సౌత్ జోన్ షూటింగ్ బాల్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు.జిల్లా ప్రతిభను జాతీయ స్థాయిలో చాటాలని ఆశిస్తూ, ఎంపికైన క్రీడాకారులకు, అసోసియేషన్ సభ్యులకు అభినందనలు తెలిపారు.


# చదువుల తల్లిని కొనలేని పరిస్థితి..మీ సమస్య - మా బాధ్యత,

## -ప్రజలతో - ప్రజలకోసం కార్యక్రమం లో వాపోతున్న పేదలు

రాజేంద్ర నగర్ జనవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );చదువుల తల్లిని కొనలేని పరిస్థితి..మీ సమస్య - మా బాధ్యత, ప్రజలతో - ప్రజలకోసం కార్యక్రమం లో పేదప్రజలు వాపోతున్నారు. బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు తలపెట్టడంలో భాగంగా పైప్ లైన్ రోడ్డు బి.ఆర్.సి నుండి సాయి గౌతమ్ కాలనీ వరకు పర్యటించడం జరిగినది.పిల్లల చదువును కొనడానికి స్కూల్ ఫీజులు భారంగా మారడంతో చిన్నా చితకా, మధ్య తరగతికి చెందిన సామాన్య ప్రజానీకం పిల్లలకు చదువు చెప్పించ లేని దీన పరిస్థితుల్లో ఉన్నామని, పేదల బ్రతుకులు దినావస్తలోనే సాగు తున్నదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్కూల్ ఫీజులపై కట్టడి చేస్తూ తగు చర్యలు చేపడత్తామని కల్లబొల్లి మాటలు చెప్పి తమను నిండుగా మోసగించి నారని వాపోయారు.ఆటో డ్రైవర్ల జీవన పరిస్థితులు చూస్తే వర్ణనాతీతంగా చాలీ చాలని ఆదాయంతో కుటుంబాన్ని పోషించడం, ఆటోల ఫైనాన్స్ కి ఇ.ఎం.ఐ లు కట్టడం కూడా చాలా కష్టంగా మారిందని మొర పెట్టుకొన్నారు.ఇకపోతే వాన రాకడ కరెంట్ పోకడ తెలియని పరిస్థితి నెలకొందని తమ వ్యధను వెళ్లబోసుకున్నారు.కార్యక్రమంలో స్థానిక వర్కింగ్ ప్రెసిడెంట్ కుంబగళ్ళ ధనరాజ్, ప్రధాన కార్యదర్శి గుట్టమీది నరేందర్, ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు, సోషియల్ మీడియా కార్యదర్శి సుమనళిని, మైనారిటీ సీనియర్ నాయకుడు షేక్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీలో చేరికలు

## - బీఆర్ఎస్ నేత చెల్మెడ స్వాగతం



వేములవాడ, జనవరి 23:బిఆర్ఎస్ నియెజక వర్గ ఇంచార్జ్ చెలిమెడ నరసింహారావు సమక్షంలో 26వ వార్డు నాయకులు చందనం శ్రీనివాస్, వార్డు యువకులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. 26వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా మామిండ్ల జమున-కనకరాజుకి చందనం శ్రీనివాస్, సినియర్ నాయకులు ఇన్నాడి సత్యనారాయణ రెడ్డి, చీటి రాధకిషన్ రావు ఆధ్వర్యంలో సుమారు 30మంది యువకులు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా చెల్మెడ లక్ష్మినరసింహరావు మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో గతంలో లాగా మున్సిపల్ లో బిఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని అన్నారు.పట్టణ ప్రజలంతా బిఆర్ఎస్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ప్రజలకు చేసింది ఏమిలేదని విమర్శించారు.ఈ కార్యక్రమంలో మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, మాజి కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, గోలి మహేష్, సిరిగిరి చందు, ఆంజత్ పాషా, దుర్శేట్టి ప్రేమ్ చారీ, బోల్గం దేవరాజు బిఆర్ఎస్ పార్టీలో చేరిన యువకులు పబ్బ శ్రీకాంత్, గంగరాజు యాదవ్, బయాన భరత్, దిలిప్ యాదవ్, రోహన్, శశీ, క్రిష్ణ, సాయి వరుణ్, రాకేష్, రాజేష్, ఆరుణ్, సురేష్, నాగిశెట్టి నారాయణ, దేవరాజు, రాజయ్య, తదితరులు ఉన్నారు.

ఆహ్వానం
తెలుగు సాహితీవనం ఆధ్వర్యంలో
తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో
పుస్తక ఆవిష్కరణ సభ
విశ్వసాహిత్యం
ప్రపంచ ప్రఖ్యాత గ్రంథాల పరిచయం
(వ్యాస సంకలనం)
తెలుగు సాహితీవనం 10వ ప్రచురణ
సభాధ్యక్షులు: శాంతి కృష్ణ
ముఖ్య అతిథి: డా. సి. మృణాళిని
గ్రంథ పరిచయం: ఆడెపు లక్ష్మీపతి
ఆత్మీయ అతిథి: డా. కృష్ణారావు రెడ్నం
గౌరవ అతిథులు: అంపశయ్య నవీన్, ఏనుగు నరసింహారెడ్డి, చెలమచర్ల భాస్కర్ రెడ్డి, సత్యాజీ, స్వాతి శ్రీపాద, చమన్, సంపత్ కుమార్, కొల్లూరి సోమశంకర్
సమన్వయం: సుమన ప్రణవ్
వందన సమర్పణ: కంచిపాటి వెంకట్
తేదీ: 29.01.2026 గురువారం,
ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 1గంట వరకు
వేదిక: రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్, హైదరాబాద్

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com